# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 43 సంచిక: 19 విజయవాడ 5-2-2011 పేజీలు: 8 వెల: రు 5.00

www.janashaktionline.com


లోపలి పేజీల్లో...


- ట్యునీసియాలో ప్రజావెల్లువ
- ఆసియాలో అమెరికా పట్టును బలీయం చేసే పైప్‌లైన్
- భారత కార్మిక సదస్సు 43వ సమావేశాలు
- మతకలహాలు-2010-డా॥ అస్ఘర్ అలీ ఇంజనీర్
- మృత్యువుకి చేరువలో బాలలు


# అమలుచెయ్యని ప్రభుత్వ హామీలు-అమ్ముడుపోని ఆహార ధాన్యాలు

**గత** సంవత్సరం ఆగస్టు నుండి డిసెంబరు వరకు సంభవించిన తుఫాన్‌లు, ఎడతెగని భారీ వర్షాల వలన అపారంగా పంటలు నష్టపోయాయి. వరి రైతాంగం నష్టపోయిందిపోగా మిగిలిన ధాన్యాన్ని అమ్ముకోవటం పెద్ద సమస్యగా మారింది. గత సంవత్సరం నిల్వఉన్న లక్షలాది బస్తాల ధాన్యంతోపాటు ఈ ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యాన్ని వ్యాపారులు కొనటానికి ముందుకురాక పోవటం; కొన్నప్పటికీ ధరను గణనీయంగా తగ్గించటం వలన రైతాంగం నష్టపోతూ, అనేక అవస్థలు పడుతున్నారు. కుటుంబ అవసరాలకు, దాళ్వాసాగుకు డబ్బులులేక, ఉన్న అప్పులకు తోడు తిరిగి అప్పులు చేస్తున్నారు.

ఎడతెరిపిలేని భారీవర్షాలకు, తుఫాన్‌లకు రాష్ట్రంలో దాదాపు 4వేల కోట్ల రూపాయలపైగా పంటలకు నష్టం జరిగింది. కొందరు రైతులు పూర్తిగా పంటను కోల్పోతే మిగతా రైతులు సగం పంటను కోల్పోయారు. పంట ఖర్చులు కూడా రాని పరిస్థితి రైతులకు ఏర్పడింది.

నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామనీ, తడిసి, రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామనీ డిసెంబర్ 16న అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పిన ముఖ్యమంత్రి అందుకు ప్రకటించిన అరకొరా పరిహారపు ప్యాకేజీ కూడా అందించకపోవటం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవటంతో రైతాంగం తీవ్ర సమస్యలనెదుర్కొంటున్నారు.

## నామమాత్రపు కొనుగోళ్ళు

రాష్ట్రంలో తడిసి రంగు మారిన ధాన్యం 30 లక్షల టన్నుల వరకు ఉంది. ఇప్పటివరకు 2.48 లక్షల టన్నులు మాత్రమే రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల శాఖ, మహిళా క్రాంతిపథకం (ఐ.కే.పి.) గ్రూపులతో సహా 3 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంది. ఏ జిల్లాలోనూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సక్రమంగా జరగలేదు. **పశ్చిమగోదావరి** జిల్లాలో ఇప్పటివరకు 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. పౌరసరఫరాలశాఖ, ఐ.పి.కే. కేంద్రాలు ఏ గ్రేడ్ రకం ధాన్యం 2,527; కామన్ రకం ధాన్యం 37,050 క్వింటాళ్ళు కొనుగోలు చేశాయి. వీటికన్నా ప్రైవేటు వ్యాపారులు, రైస్ మిల్లర్లే ఎక్కువగా కొనుగోలు చేశారు. ఇంకా జిల్లాలో అధిక మొత్తంలో లక్షలాదిక్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. **తూర్పుగోదావరి జిల్లాలో** పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. రాజమండ్రి-కాకినాడ మినహా 17 నియోజక వర్గాల్లో 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో వెయ్యి క్వింటాళ్ళలోపు ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగింది. ముమ్మడివరం, రాజానగరం, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, నియోజకవర్గాల్లో మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయి. అమలాపురం డివిజన్‌లోని 16 కేంద్రాల్లో 150లోపు క్వింటాళ్ళ ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. **క్రిష్ణాజిల్లాలో** పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యములో 44 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోయిన డిసెంబరు నాటికి 85 టన్నుల ధాన్యం మాత్రమే ఈ కేంద్రాల్లో కొనుగోలు జరిగింది. **గుంటూరు జిల్లాలో** 33 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఈ నెల 16వ తేదీవరకు 25 కేంద్రాల్లో ఒక్క గింజ కూడా కొనుగోలు జరగలేదు. ఈ వాస్తవాన్ని అధికారుల నివేదిక ధృవీకరిస్తున్నాయి. తెనాలి, భట్టిప్రోలు, వేమూరు, రేపల్లె, కొల్లిపర, క్రోసూరు మండలాల్లో కేవలం 851 క్వింటాళ్ళు మాత్రమే ధాన్యం కొనుగోలు జరిగింది. ఇదే సమయంలో బియ్యం మిల్లర్లు 29,755 టన్నుల మేలురకం, మరో 669 టన్నుల 50% రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం 14 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించినా, అందుకు అనుగుణంగా ప్రభుత్వసంస్థలు ధాన్య సేకరణలో విఫలమౌతున్నాయి. వినుకొండ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, బాపట్ల, తదితర కేంద్రాలు రైతులకు సలహాలు ఇవ్వటానికి మాత్రమే పరిమితమౌతున్నాయి. తెనాలి మార్కెట్‌యార్డులో 50 నమూనాలు రైతులు తీసుకొని రాగా వాటిలో 9 మంది నుండి మాత్రమే కొనుగోలు చేశారు. వీటిల్లోను ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసింది నలుగురి నుండే! మిగతా ఐదుగురు రైతుల నుండి మిల్లర్లు కొనుగోలు చేశారు. **ప్రకాశం జిల్లాలో** ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. **శ్రీకాకుళం జిల్లాలో** పౌరసరఫరాల శాఖ. ఐ.పి.కే. ఆధ్వర్యములో వంద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పినా, ఆ మేరకు ఇంకా ఏర్పాటు కాలేదు. **నల్గొండ జిల్లాలో** పౌరసరఫరాల సంస్థ 9 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రంలోనూ 500 క్వింటాళ్ళకు తక్కువ కాకుండా కొనుగోలు చేస్తామని చెప్పినా, ఆ విధంగా జరగటంలేదు. **మహబూబ్‌నగర్ జిల్లాలో** 180 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా 66 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిల్లోను 54 కేంద్రాల్లో మాత్రమే నామమాత్రంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ విధంగా ప్రతిజిల్లాలోనూ రంగుమారిన ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయటంలో ప్రభుత్వ సంస్థలు మొండిచేయి చూపుతున్నాయి.

## అమలుకాని ప్రభుత్వ హామీ

10 శాతం లోపు తడిసి, రంగుమారిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి రైతుల నుండి కొనుగోలు చేస్తామని, ఆపైన ఒక్కోశాతానికి 10.30రూ॥ తగ్గించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిబంధనపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. ముంపుకి గురైన ధాన్యం 50% దాకా రంగుమారింది. ఇలాంటి పరిస్థితుల్లో నిబంధనలు మార్చి ధాన్యం కొనుగోలు చేయాలనే డిమాండ్ ఆందోళన రూపం దాల్చటంతో, తేమ, రంగు మారిన, ఇతర లోపాలు 50%లోపు ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ హామీని కూడా ముఖ్యమంత్రి నిలబెట్టుకోలేక పోయాడు. ప్రభుత్వ హామీని నమ్మి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వెళ్తే పదిశాతం రంగుమారిన ధాన్యానికి మాత్రమే మద్దతు ధర యిస్తామని, ఆపైన ఒక్కోశాతానికి 10.30 రూ. తగ్గిస్తామని అధికారులు రైతులకు చెబుతున్నారు. అదేమిటని రైతులు అడిగితే, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కొనుగోలు చేస్తున్నామంటున్నారు. రైతులను మభ్యపెట్టి ఆందోళనను చల్లార్చేందుకే రంగుమారిన ధాన్యం కొనుగోలు శాతాన్ని పెంచిందన్నది దీని ద్వారా స్పష్టమౌతున్నది. ప్రభుత్వ సంస్థల కొనుగోళ్ళమీద రైతాంగం 300 రూ॥ నుండి 400 రూ॥ దాకా క్వింటాల్‌కి నష్టపోవాల్సి వస్తున్నది. ఫలితంగా ధాన్యం అమ్ముకొన్నా పంట ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

## మిల్లర్లతో కుమ్మక్కు

ముంపు వలన 10 లక్షలటన్నుల ధాన్యం పూర్తిగానూ, మరో రెండులక్షల టన్నుల ధాన్యం 50 శాతం మేరా రైతాంగం నష్టపోయారు నష్టాలు, కష్టాలలో ఉన్న రైతాంగానికి అండగా ఉండవలసిన ప్రభుత్వ సంస్థలు, మిల్లర్ల పక్షాన దళారులుగా వ్యవహరిస్తున్నాయి. చాలాచోట్ల ఎఫ్.సి.ఐ. ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవద్ద నాణ్యతా పరీక్షలకు సంబంధించిన సిబ్బంది ఉండటం లేదు. ఈ కేంద్రాలు ధాన్యం కొనుగోలుకు ఆసక్తిని చూపటంలేదు. గింజలో తేమ, పిండి, క్షోభతో (తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

# అవినీతిపై "యుద్ధం"

**అవినీతి,** అక్రమార్జనలు నేడు జీవిత విధానంగా మారాయి. "ప్రభుత్వం అవినీతినెందుకు చట్టబద్ధం చేయకూడదు? అలా చేస్తే తానెంత చెల్లించాల్సి వస్తుందో ప్రతిఒక్కరికీ ముందుగానే తెలుస్తుంది. నానాటికీ ద్రవ్యోల్బణం పెరిగిపోతుంటే పాపం ప్రభుత్వోద్యోగులేం చెయ్యగలరు" అని దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యంగ్యంగానైనా వ్యాఖ్యానించేంతగా ఇది వ్యవస్థీకృతమైపోయింది. సామాన్య ప్రభుత్వోద్యోగివద్ద కొన్ని కోట్ల రూపాయల నల్ల ధనం బయటపడిన వార్తలు ఎంత తరచుగా వస్తున్నాయో రాజకీయ అధినేతల నిర్ణయాలతో లక్షలకోట్ల ప్రజాధనాన్ని బడాబూర్జువాలు కొల్లగొడుతున్న అక్రమార్జన పర్వాలు అంత తరచుగానూ పత్రికల కెక్కుతున్నాయి. వ్యక్తుల, దేశాల ఉమ్మడి కోర్కెలను తీర్చే ఉమ్మడి వ్యభిచారైన ధనం సర్వ శక్తివంతమై మానవ స్వభావాన్ని పూర్తిగా తద్విరుద్ధంగా మారుస్తున్నదన్న మార్క్స్ మాటలు ధన స్వామ్యపు వ్యవస్థలో ఈ అక్రమార్జనలు అంతర్భాగమన్న అంశాన్ని గుర్తు చేస్తున్నాయి.

నేటి ప్రధాని ఆర్థిక మంత్రిగా నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన 1991లో 35 కోట్ల మంది భారతీయులు దారిద్ర్యరేఖకు దిగువనుండగా, నేటికి 45 కోట్లమంది దరిద్ర్యంలో కూరుకు పోయారు. కాగా ఈ కాలంలో 10 శాతంగా వున్న భారత ధనికుల ఆస్తులు వందరెట్లకు పైగా పెరిగాయి. దీనిలో సింహభాగం 300 కుటుంబాలు లేదా గ్రూపులకే చేరింది. (కొన్ని వివరాలు చివర పేజీలో) ఇది చట్టబద్దంగా. అక్రమంగా అయితే 2001-2008 మధ్యకాలంలో విదేశీ బ్యాంకులలోకి చేరిన నల్లధనం 84 వేల కోట్లరూపాయలు. అంటే ఈ అక్రమార్జనే లేకపోతే 10 కోట్ల మంది దారిద్ర్యంలోకి చేరేవారు కాదు. చిటికెడు ఉప్పు, చెంచాడు పంచదార కలిపిన గ్లాసు నీరు తాగించలేక 30 శాతం మంది పిల్లలు అతిసార వ్యాధికి లోనవుతుండగా, భారతీయులు తిండి తినటం ఎక్కువైనందున ఆహార ధరలు పెరిగి పోయాయంటూ సిగ్గుమాలిన ప్రచారం సాగిస్తున్నారు. స్విస్ బ్యాంకుల్లో దాచిన నల్లధనం గూర్చిన చర్చ రాజకీయ నాయకులొక్కరిదే అయినట్లు సాగుతుండగా దీనిలో బడాబూర్జువా వర్గం వాటాయే అధికం. ఈ నల్లధనం వెనక్కు వస్తే భారత ప్రజలు ఒక్కపైసా పన్ను కట్టకుండానే పాలన సాగుతుంది. దేశ సంపదను ప్రవాహంలా తరలించేసి గ్రామాలలో మహిళలకు మరుగుదొడ్డి నిర్మించేందుకు కూడా నిధులు లేవంటూ విదేశాలకు బొచ్చె పట్టుకు వెళ్లటాన్నే తన ఘనకార్యంగా చెప్పుకునే సిగ్గుమాలిన దశకు దేశాన్ని చేర్చారు.

మెక్‌కిన్సీ అన్న విదేశీ సలహాదారు కంపెనీ 2010 నవంబరులో రూపొందించిన నివేదికలో భారత ప్రభుత్వ చేస్తున్న వ్యయంలో లీకేజి (అక్రమార్జనలకు అందమైన పదం) ఏడాదికి 18 బిలియన్ డాలర్లు (81 వేల కోట్ల రూ॥) అని అంచనా వేసింది. ఈ అక్రమార్జనలే లేక పోతే భారత పేద ప్రజల ఆదాయం ఏడాదికి 20 శాతం పెరిగి వుండేది. ఐదేళ్ళలో వారి ఆదాయం రెట్టింపై పేదరికం నుండి బయటపడి వుండేవారు. ఇది అవినీతి, అక్రమార్జనలు వ్యవస్థలో అంతర్భాగంగా సాగటమే కాక, దేశ ప్రజలను నిత్యదారిద్ర్యంలోకి నెట్టివేస్తున్నదని తెలుపుతున్నది.

సమాజ రుగ్మతలన్నింటికీ సర్వరోగ నివారిణిగా జపిస్తున్న మంత్రం స్వేచ్ఛా మార్కెట్టుకు మూలస్థంభమైన పెట్టుబడిదారీ విధానమే ఈ అవినీతి అక్రమార్జనల నెలవుగా వుంది. ఆయుధాల అమ్మకానికి సాగిన "స్వేచ్ఛాయుత" పోటీలో వాణిజ్య ఖర్చుల పేరిట లంచాలు మేసిన భోఫోర్సు చెల్లింపులనుండి, మొదట బంధువర్గానికిచ్చి వాటినుండి విదేశీ టెలిఫోను కంపెనీలకు లైసెన్సులు అమ్ముకుని వేలకోట్లతో జేబులు నింపుకున్న 2జి కుంభకోణం వరకూ స్వేచ్ఛామార్కెటు చోదకశక్తులయిన బహుళజాతి కంపెనీలే సాగించాయి. ఈ మూడు దశాబ్దాలలో జరిగిన "అభివృద్ధి" లంచం కాస్తా పెరిగిన షేరు విలువగా పేరుమార్చుకోవటమే. అక్రమార్జన షేరు మార్కెట్టు జూద గృహంలో ద్రవ్య పెట్టుబడి రూపమెత్తింది.

నాలుగు దశాబ్దాలనాడు లాటిన్ అమెరికానుండి సంపదలతో పారిపోయిన దేశాధినేతలనుండి, టన్నులకొద్ది బంగారాన్ని తనతోపాటు విమానంలో తరలించుకుపోయిన ఫిలిప్పైన్సు అధినేత మార్కోస్‌నుండి, దేశ సంపదలో సగాన్ని తన భార్యాబిడ్డల ఆస్థిగా మార్చిన ట్యునీసియా పదవీచ్యుత అధ్యక్షుడు బెన్‌ఆలీ వరకూ, అక్రమార్జనలతో సహా భార్యాబిడ్డలను లండనుకు పంపించి ఇంకా పదవిని నిలుపుకునేందుకు సకల ప్రయత్నాలూ చేస్తున్న ఈజిప్టు అధ్యక్షుడు ముబారక్ వరకూ సామ్రాజ్యవాదుల ద్రవ్యసంస్థలు రుద్దిన స్వేచ్ఛా మార్కెట్టు చేతి కీలుబొమ్మలే. ఈ దారి దోపిడీనే ఆర్థికవ్యవస్థ పురోగమనంగా చివరి నిముషంవరకూ చిత్రిస్తూ వచ్చింది ఈ ద్రవ్యసంస్థలే. అక్రమార్జనలను ప్రపంచ స్థాయిలో వ్యవస్థీకరించింది సామ్రాజ్యవాదమే. తన సవాలక్ష ప్రచార సాధనాలద్వారా ఈ అక్రమార్జనలను బయటపెట్టి, మూడవ ప్రపంచదేశాలలోని ప్రభుత్వాలను రాజకీయంగా అస్థిరపరిచి మరింతగా లొంగదీసుకునే సాధనంగానూ, దుష్పరిపాలనపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహాన్ని తన తైనాతిపైకి మరల్చి, మరొక కీలుబొమ్మను అధికారపీఠమెక్కించే వంచననూ సాగించే కళగా సామ్రాజ్యవాదం అభ్యసిస్తున్నది. "గత నాలుగు దశాబ్దాలుగా ఈ లోపభూయిష్ట సిద్ధాంతాన్ని(స్వేచ్ఛా మార్కెట్టు) అమలు జరిపినందుకు చింతిస్తున్నాను" - ఈ మాటలన్నది అమెరికా రిజర్వు బ్యాంకు అధ్యక్షుడు అలాన్ గ్రీన్‌స్పాన్.

ఏమిటా లోపభూయిష్టత? స్వేచ్ఛా మార్కెట్టును కౌగలించుకుని నూతన ఆర్థిక విధానఅమలు కార్లు, ఎయిర్ కండిషనర్లు, తదితర విలాస సరుకుల ఉత్పత్తితోనూ, వినియోగంతోనూ 10శాతం మందికి విలాసవంత జీవనశైలిని తీసుకురాగా, 90శాతం మంది భారతీయులకు విద్యా, వైద్యాలను ఖరీదైన సరుకులు చేసింది. కనీస అవసరాలైన ఆహారం, తిండి, బట్ట, మంచినీరు కూడా అందుబాటులో లేకుండా చేసింది. రెండున్నర లక్షలమంది రైతులను హతమార్చింది. చేనేత పనివారల బ్రొటనవేళ్లను నరకటంతో సరిపెట్టుకున్న వలసపాలన నేడు వారి పీకలకు ఉరితాళ్ళు బిగిస్తున్నది.

(తరువాయి 2వ పేజీలో)

**అమలుకాని ప్రభుత్వ ... (మొదటి పేజీ నుండి)** భారంగా ఇంటికి వెళుతున్నారు. పౌరసరఫరాలశాఖ, ఐ.పి.కె. సంస్థలు కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెక్కుల రూపంలో రైతులకు యిస్తున్నారు. ఈ చెక్కులు మారటానికి రెండు నెలలుదాకా కాలం పడుతుందని అధికారులే చెబుతున్నారు. అప్పుల్లో, అవసరాల్లో ఉన్న రైతాంగం డబ్బులకోసం రెండునెలలు ఆగటం సాధ్యంకాదు. అందువలన ఎక్కువమంది రైతాంగం మిల్లర్లకు ధాన్యాన్ని తెగనమ్ముకొంటున్నారు. రంగుమారిన ధాన్యంబస్తా నాలుగు లేక ఐదువందలకి మించి ధర లభించటంలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ధాన్యం కొనుగోలుకు అనేక వంకలు పెట్టి, రైతులను మిల్లర్ల దగ్గరకు వెళ్లేటట్లు చేస్తున్నాయి. దానికి ప్రతిఫలంగా మిల్లర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులకు తాయిలాలు అందచేస్తున్నారు. మిల్లర్లు పెద్దమొత్తంలో లాభంపొందుతున్నారు.

## పూర్తి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మన రాష్ట్రంలో లాగానే, పంజాబ్ రాష్ట్రంలోను అధిక వర్షాల వలన వరిపంటకు తీవ్ర నష్టం జరిగింది. తడిసి, రంగుమారిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ఎఫ్.సి.ఐ. కొనుగోలు చేయాలని పంజాబ్ ప్రభుత్వం, కేంద్రంపై వత్తిడి చేయగా, పదిశాతం రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయించి మద్దతు ధర చెల్లించింది. అంతే కాకుండా 10 శాతంపైగా రంగుమారిన ధాన్యం మొత్తాన్ని రైతులనుండి పంజాబ్ ప్రభుత్వం కొనుగోలు చేసింది కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి, రంగుమారిన బియ్యాన్ని వేరు చేసేందుకు స్టార్‌టెక్ రైస్ మిల్లులకు కాంట్రాక్టుకు అప్పగించింది. పదిశాతం రంగుమారిన క్వింటాల్ ధాన్యానికి 115 రూ॥, 20 శాతం రంగుమారిన ధాన్యానికి 215రూ॥ చొప్పున మిల్లింగ్ ఛార్జీలను యిచ్చింది. ఇలా చేసిన బియ్యాన్ని రాష్ట్ర అవసరాలకు ఉపయోగిస్తున్నది. నష్టపోయిన పంజాబ్ రైతులకు ఈ విధానాల వలన కొంతమేరకు ఊరట లభించింది. మన రాష్ట్ర ప్రభుత్వంకి మేలురకం బియ్యం 20 రూ॥కు, రంగుమారిన బియ్యం 10 రూ॥లకే ప్రజలకు అమ్మవచ్చు. దీనివలన బియ్యం వినియోగదారులకు ఊరటనిస్తుంది.

ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు పాడై ప్రతిసంవత్సరం రైతాంగం నష్టపోతూనే ఉన్నా, ఈ సంవత్సరం జరిగిన నష్టం వలన, రైతాంగం నవనాడులూ కృంగి పోయాయి. ఎకరానికి రూ॥ 20వేలు దాకా నష్టం వాటిల్లింది. ఈ నష్టమే కాకుండా పండిన పంటకు సరైన ధర లభించక రైతాంగం నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుని బయటపడే మార్గం కానరాక కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎటువంటి ఆంక్షలూ, నిబంధనలూ లేకుండా రంగుమారిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసేటట్లు తక్షణం చర్యలు తీసుకోవాలి. కనీస మద్దతు ధరను పెంచాలి. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతిని, అవకతవకలను అరికట్టాలి. రైతాంగం నుండి నేరుగా కొనుగోళ్ళు ప్రారంభించాలి. అలాంటి చర్యలు తీసుకొనే విధంగా పాలకులపై తమ ఆందోళనను రైతాంగం ఎక్కుపెట్టాలి. D

**అవినీతిపై... (మొదటి పేజీ నుండి)**

ఈ అవినీతి, అక్రమార్జనల్లో మునిగితేలిన నేతలందరూ నేడు అవినీతిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టి బలిసిన పరిశ్రమాధిపతులందరూ అవినీతిని అదుపుచేసేందుకు ప్రభుత్వానికి సూచనలందజేస్తున్నారు. తాను తప్ప తక్కిన వారందరూ అవినీతి పరులేనన్న చందంగా మాట్లాడుతున్నారు. మచ్చలేని గురివిందలుగా చెలామణీ కాజూస్తున్నారు. ఒకసారి అధికార పీఠమెక్కగానే దేశ ప్రయోజనాల దృష్ట్యా జరిగిన నిర్ణయాలను డబ్బుతో కొలవరాదంటూ సన్నాయి నొక్కులు నొక్కుతారు. నల్లధనం వెలికి తీయటానికి అవకాశాలు లేవంటూ తేల్చిచెబుతారు. విమర్శకులతో గొంతుకలిపి పాపపు సొమ్ముకోసం పరుగులొద్దని హితబోధలూ చేస్తారు.

ఇక దీనికి ముగింపెక్కడ? స్విస్‌బ్యాంకుల్లో దాచిన నల్లధనాన్ని దేశసంపదగా ప్రకటించి, అక్రమార్జనపరులను శిక్షించాలన్న తక్షణ డిమాండుతోపాటు అవినీతి అక్రమార్జనలకు నెలవైన దోపిడీ వ్యవస్థను కూల్చివేసి నూతన ప్రజాస్వామ్య సమాజ స్థాపనకు పోరాడేందుకు ప్రజలు సంసిద్ధపడి సాగినప్పుడే అవినీతికి ముగింపు సాధ్యమౌతుంది. ప్రజా జీవనంలో సుఖశాంతులు నెలకొంటాయి. D

## ఝార్ఖండ్ ఛోటా నాగపూర్ కౌలుదారీ చట్టాన్ని విఫలం చేసే ప్రయత్నాలు

**ఆదివాసీల** మహానాయకుడు బీర్సా ముండా సాగించిన వీరోచిత పోరాట ఫలితాలలో ఒకటి ఛోటా నాగపూర్ కౌలుదారీ చట్టం. ఇంతవరకూ జార్ఖండ్ రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలేవీ ఈ చట్టాన్ని అమలు జరిపేందుకు చర్యలు తీసుకోలేదు. కానీ దానిని పనికిరానిదిగా మార్చేందుకే బాబూలాల్ మరాండీ, శిభుసోరేన్‌ల ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసాయి. ప్రస్తుత అర్జున్‌ముండా ప్రభుత్వంకూడా బహుళజాతి కంపెనీల, భూకబ్జాదారులకు అనుకూలంగా ఈ చట్టాన్ని సవరించాలని చూస్తున్నది.

అయితే 2010 డిసెంబరు 4న ప్రభుత్వ కార్యదర్శి ఈ చట్టాన్ని ఖచ్చితంగా అమలు జరపమని జిల్లా యంత్రాంగాలకు ఆజ్ఞలు జారీ చేశాడు. దీనితో భూకబ్జాదారులూ, ఇతర స్వార్ధపర శక్తులూ, పెద్ద కంపెనీలు దీనికి వ్యతిరేకంగా యాగీచేసాయి. ఈ వత్తిడికి లొంగిన ముఖ్యమంత్రి, కార్యదర్శి జారీచేసిన ఆజ్ఞలను ఆపివేశాడు.

సంతాల్ పరగణాల కౌలుదారీ చట్టంలోలాగే ఛోటానాగపూర్ కౌలుదారీ చట్టంలో కూడా ఆదివాసులు, వెనుక బడిన కులాలకు చెందినవారు భూమిని తమ కులానికి చెందిన వారికే బదలాయించాలన్న నిబంధనవుంది. ఈ నిబంధనను తప్పని సరిగా అమలు చెయ్యాలన్నదే డిసెంబరు 4 నాటి కారదర్శి ఆజ్ఞలలోని కీలకాంశం.

1908లో చేసిన ఈ చట్టాన్ని అనేక మార్లు సవరించారు. భూమి బదలాయింపుకు సంబంధించి 1955లో చేసిన సవరణనేటికీ అమలులో వుండాలి. దీని ప్రకారం ఆదివాసీలు, వెనుకబడిన కులాలవారు తమకున్న భూమిని లేదా దానిలో కొంత భాగాన్ని అదే పోలీసుస్టేషను పరిధిలో నివశిస్తున్న తన కులానికే చెందిన వ్యక్తికే అమ్మాలి, బదలాయించాలి, బహుమతిగా యివ్వాలి లేదా విల్లు ద్వారా సంక్రమింప చేయాలి. లేదా తాకట్టుపెట్టాలి.

1969లో ఒక కేసులో పాట్నా హైకోర్టు ఈ నిబంధన చెల్లదని తీర్పునిచ్చింది. బీహారు కౌలుదారీ చట్టం ప్రకారం ఈ క్లాజు చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ తీర్పుపై విచారణ జరిపిన పాట్నా హైకోర్టు రాంచి ఫుల్‌బెంచి 1955 సవరణతో సహా ఈ చట్టం ఛోటానాగపూర్ ప్రాంతానికి వర్తిస్తుందని 1996 మే 1న తీర్పునిచ్చింది.

ఈలోగా గత శతాబ్దకాలంలో తమ భూములు, ఇళ్లు, వనరులు, జీవనాధారాల నుండి కోటి మంది జార్ఖండీయులు దూరం చేయబడ్డారు. వారిలో సగం మంది జార్ఖండ్‌ను వదిలి బయటకు వలసపోయారు. మరో వైపున అభివృద్ధి పేరిట గుత్త పెట్టుబడి దారులూ, ధనాఢ్యవర్గాలూ జార్ఖండ్ భూములనూ, వనరులనూ ఆక్రమించుకున్నారు. భూకబ్జాదారులు జార్ఖండ్ నలుమూలలా భూములను ఆక్రమిస్తున్నారు. రహదారుల కోసమంటూ ప్రభుత్వం భూ సేకరణ చేయగా వాటి దగ్గరి భూములను వీరు ఆక్రమిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే కార్యదర్శి ఆజ్ఞలు జారీ చేయటం, ముఖ్యమంత్రి వాటిని ఆపివేయటం జరిగాయి. పోరాటాల వత్తిడికి చట్టాలను చేయటం, వాటిని అమలు జరపకుండా కాలయాపన చెయ్యటం, తర్వాత వాటిని నీరుగార్చటం పాలకుల విధానంగావుంది.

విప్లవ పోరాట యోధుడు బీర్సాముండా అమరత్వం పొందిన రోజు జనవరి 8. ఆరోజున హుల్ జార్ఖండ్ క్రాంతి దళ్ రాంచీలోని రాజ్‌భవన్ ఎదుట రోజంతా ధర్నా చేసింది. ఛోటా నాగపూర్ కౌలు గారీ చట్టాన్నీ, ఇతర ప్రజానుకూల చట్టాలను నీరుగార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిరసన తెలిపింది. 150 మంది ప్రదర్శనగా వచ్చి రాజ్‌భవన్ వద్ద ధర్నా చేసి వెయ్యిమంది సంతకాలు చేసిన 25 డిమాండ్లతో కూడిన విజ్ఞాపనా పత్రాన్ని గవర్నరుకు యిచ్చారు. D


జనశక్తి ప్రచురణ

**విభజనవాద-సమైక్యవాదమూలాలు**

**మార్క్సిస్టు పరిశీలన-కర్తవ్యాలు**

వెల: రు. 5/-

ప్రతులకు : **మైత్రీ బుక్ హౌస్**విజయవాడ-2


## ఒడిషా మెరుగైన సహాయం కోసం ఆందోళన

**2010** డిసెంబరు మొదటివారంలో కురిసిన అకాలవర్షాలకు ఒడిషాలోని రైతాంగం తీవ్రమైన నష్టాన్ని పొందారు. పంటకోతకు వచ్చిన తరుణంలో సంభవించిన ఈ నష్టం అపారమైంది. ఒడిషా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలూ ఈ విస్తారమైన, అకాల వర్షాల తాకిడికి గురయ్యాయి.

పాలకవర్గాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా ఒడిషాలో వ్యవసాయార్ధిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. రైతాంగ సమస్యలపట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, తుఫానులు, వరదలు, కరువుల వంటి అంతులేని విపత్తులతో కూడిన గ్రామీణ ఆర్ధిక పరిస్థితుల నుండి రైతాంగాన్ని రక్షించటంలో ప్రభుత్వ రంగం విఫలమైంది. ప్రస్తుత అకాల వర్షాలు సంక్షోభాన్ని మరింత తీవ్రం చేశాయి, మరింతగా దిగజార్చాయి. ప్రస్తుత విపత్తు కారణంగా లక్షలాదిమంది రైతులు తీవ్ర నిరాశ నిస్పృహల్లోకి నెట్టబడ్డారు. 2010 డిసెంబరు నాటినుండి ఆత్మహత్యల కారణంగానో, గుండెపోటుల కారణంగానో దాదాపు 100 మంది రైతులు చనిపోయారనే వాస్తవం ఒరిస్సాలో రైతాంగ దుస్థితికి సంబంధించిన ప్రమాదకరమైన పార్శ్వాన్ని వెల్లడిచేస్తున్నది.

ఎప్పటిలాగే, ఒడిషా ప్రభుత్వం ఈ విపత్తు బాధితుల పట్ల కూడా ఘోరమైన నిర్లక్ష్యాన్ని వహించింది. మొత్తంగా సహాయ, పునరావాస చర్యలను పూర్తియాంత్రికంగానూ, లాంఛనంగానూ కుదించివేసి అమలుకు నోచుకోని డొల్ల వాగ్దానాలతో నిరాసక్తంగా చేతులెత్తివేసింది.

ఈ అకాల వర్షాలు 30 జిల్లాలనూ తీవ్రంగా నష్టపరిచాయి. కటక్, జగత్‌సింగ్‌పూర్, జాజ్‌పూర్, కేంద్రపరా, భద్రక్, బాలాసోర్ మరియు అనుగల్ వంటి 7 కోస్తా జిల్లాలను వర్షాలకు నష్టపోయిన జిల్లాల జాబితా నుండి రాష్ట్ర ప్రభుత్వం తొలగించివేసింది. మిగిలిన జిల్లాలను 50 శాతం ఆపైన నష్టపోయిన జిల్లాలుగాను; 50 శాతం కంటే తక్కువ నష్టపోయిన జిల్లాలుగాను వర్గీకరించింది. 49 హెక్టార్ల భూమిలో 12 హెక్టార్ల భూమి 50 శాతంపైగా పంట నష్టపోయినదిగా ప్రకటించింది. ఇదంతా జరిగిన నష్టాన్ని చాలా తక్కువచేసి చూపటం మినహావేరుకాదు.

రైతులు, రైతు సంఘాలు, వివిధ పార్టీల నిరసనల వత్తిడి కారణంగా వలసకాలం నుండీ సాగుతున్న సహాయ చర్యలకు సబంధించిన విధివిధానాల ప్రకారం ప్రభుత్వ సహాయ ప్యాకేజీ ఈ విధంగా వుంది. 1. వర్షాధార భూములకు ఎకరాకు రూ. 800 రూ॥లు, సాగునీటి సౌకర్యమున్న భూములకు ఎకరాకు 1600 రూ॥లు సహాయంగా ప్రకటించింది కానీ వాస్తవానికి పంట నష్టం ఎకరానికి 15,000 రూ॥ల నుండి 20,000 రూ॥ వరకు వుంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ కొద్దిపాటి సాయం తిరిగి అదేభూమి సాగుచేసేందుకు ఏ మాత్రం సరిపోదు. 2.స్వల్పకాలిక ఖరీఫ్ పంట రుణాలను 3 సంవత్సరాల కాలవ్యవధిలో తిరిగి చెల్లించే మధ్యంతర కాల పంట రుణాలుగా మార్చటం 3. బ్యాంకు రుణాలపై వడ్డీరేటును 9 శాతం నుండి 5 శాతానికి తగ్గింపు; నిర్ణీత సమయంలోపుగా చెల్లింపు జరిగితే రబీ పంట రుణాలలో 2 శాతం వడ్డీ మినహాయింపు; 4. భూమి పన్ను, నీటి పన్నులపై 5 శాతం తగ్గింపు, మిగిలిన మొత్తాన్ని మరుసటి సం॥ వసూలుకు అంగీకారం 5. దెబ్బతిన్న ప్రాంతాలలో హైస్కూల్ విద్యార్థుల పరీక్షఫీజుల రద్దు 6. బాధిత రైతాంగానికి పప్పుధాన్యాలు, కూరగాయల పంపిణీ. 7. పంటనష్టపోయిన స్వయం సహాయ బృందాలకు విత్తనాల ఖర్చును ప్రభుత్వం అందివ్వటం 8. కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కనీస మద్దతు ధరపై ఇప్పటికే బోనస్‌గా అందిస్తున్న 50 రూ॥ కాకుండా 100 రూ॥ పెంపు; 9. ధాన్యాన్ని కొనుగోలు చేసే సందర్భంలో తేమశాతాన్ని సడలించాలని కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయటం.

కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన మెమోరాండంలో మొత్తం పంటనష్టం అంచనా 2,200 కోట్లరూ॥ (ఇదిచాలా తక్కువ అంచనా) కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సహాయం 900 కోట్ల రూ॥ మాత్రమే (300 కోట్ల రూ॥ల కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి)

షుమారుగా రెండునెలల కాలం గడిచింది. కానీ బాధిత ప్రజానీకానికి ప్రభుత్వ వాగ్దానం చేసిన మేరకు సహాయం అందటంకూడా కలగానేవుంది. రైతుల చేతికందిన ధాన్యం కూడా పాడైపోతున్నది. రైతులు ధాన్యాన్ని తెగనమ్ముకోవటానికి నెట్టబడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామమాత్రపు సహాయం రైతుల దురవస్థను అవహేళన చేస్తున్న విధంగా వుంది.

ఒడిషాలో కౌలు వ్యవసాయానికి చట్టం గుర్తింపు లేదు. కానీ ఇది ఆచరణలో భూయజమానులకు, కౌలుదార్లకు మధ్యన అవగాహన ద్వారా వివిధ పద్ధతుల్లో కొనసాగుతున్నది. పంటను కోల్పోయిన కౌలు రైతులలో అత్యధికులు ఆత్మహత్యలకు పాల్పడిన వారుగా కానీ, గుండెపోటుకు గురైన వారుగా కానీ వున్నారనేది గమనించాల్సిన విషయం. కావున, నష్టపరిహారం సహాయం, ఇతర ప్రయోజనాలు కలుగజేస్తామనే ప్రకటనలు-కౌలుదార్లకు ఒక చట్టబద్ధమైన రక్షణకల్పింతనంతవరకు వారిని ఈ నష్టపరిహారం, సహాయం, బీమా తదితర ప్రయోజనాలు పొందేందుకు అర్హులుగా గుర్తించనంతవరకూ-ఇవన్నీ అర్ధరహితమైనవిగావుంటాయి. లేకుంటే భూమి యజమానులో భూస్వాములో లేదా అబ్‌సెంట్ భూస్వాములో మాత్రమే ప్రయోజనం పొందుతారు. 'నిజమైన సాగుదార్లకు' లబ్ధి చేకూరుస్తామని ప్రభుత్వం ప్రకటిస్తూ తదనుగుణంగా ఒక చట్టాన్ని చేయబోతున్నది. ఖచ్చితమైన విధానాలతో అది ఇంకా రావలసివుంది.

ఈ ప్రకృతి బీభత్సానికి బాధితులలో అత్యధికులు సన్న, చిన్నకారు రైతులే. వీరంతా అత్యధిక వడ్డీలకు సూక్ష్మరుణ సంస్థలనుండి అప్పుజేసినవారే. ఈ సంస్థల అణచివేత, దోపిడీలనుండి రైతులు బంధవిముక్తులు కాకుండా; ఈ సంస్థల, ఈ సంస్థల కార్యకలాపాలన్నీ చట్టపరిధిలోకి తెచ్చి నియంత్రించకుండా; సంస్థాగత రుణాలను, సహకార రుణాలను రైతులకు వర్తింపజేయకుండా ఈ చర్యలన్నీ అత్యధిక బాధిత రైతాంగానికి నిరుపయోగంగా మిగిలిపోతాయి.

రాష్ట్రప్రభుత్వం, రైతుల బలవన్మరణాలగురించి, గుండెపోటుతో మరణిస్తున్న రైతుల గురించిన వాస్తవాలను నిరాకరించటమో లేదా తక్కువచేసి చూపటమో జరుగుతున్నది. పాలకులు రైతుల బాధలను హేళనచేయటమేగాక, రైతుల విషాదకర పరిస్థితులకు కారణమైన తమ బాధ్యతనుండి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు.

తాము కోల్పోయిన దానికి రైతులకు తగిన పరిహారం, సహాయం, పెట్టుబడులులేక తమ జీవనాన్ని, వ్యవసాయక కార్యకలాపాలను సజావుగా కొనసాగించేందుకు తగిన మద్దతునూ అందజేయాలి.

కేంద్రం ఎల్లవేళలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూనే ఒడిషా రైతుల సమస్యల పరిష్కారంవైపే నిలచినట్లుగా నటిస్తున్నది. నవీన్ పట్నాయక్ ప్రభుత్వం తన స్వీయబాధ్యతనుండి తప్పుకుంటూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో కేంద్రం ఉదారంగా వుంటూ ఒడిషా రాష్ట్ర రైతులకు సహాయమందించేందుకు అవసరమైన నిధులను సమకూర్చటంలేదని ఆరోపిస్తున్నది. ఒడిషాలోని ప్రతిపక్షమైన కాంగ్రెస్‌పార్టీ రైతాంగ సమస్యలపట్ల నవీన్‌పట్నాయక్ నిర్లక్ష్యపూరిత వైఖరిని ఎండగడుతూ అనేక ప్రదర్శనలు చేపట్టింది. ప్రక్కదోవ పట్టించే రాజకీయాలకు, ఈ కుళ్ళు రాజకీయ క్రీడకు అసలైన బాధితులు రైతులే.

వివిధ రైతుసంఘాలు, వివిధ పార్టీలు-బాధిత రైతాంగానికి సరైన పరిహారం, సహాయం అందించాలని డిమాండ్‌చేస్తూ రైతాంగాన్ని ఆందోళనల్లోకి సమీకరిస్తున్నారు. చాషీమూలియా సంఘ(ఒడిషా) 2010 డిసెంబర్ 18న పూరి కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించింది. ఈ క్రింది డిమాండ్లపై ముఖ్యమంత్రికి ఒక మెమోరాండంను అందజేసింది. అన్ని జిల్లాలనూ పంటనష్టం జరిగిన జిల్లాలుగా ప్రకటించాలనీ; పంట నష్టానికి ఎకరానికి 20వేల రూ॥అందించాలని; ఈ సౌకర్యాన్ని కౌలురైతులకు కూడా అందించాలని; బ్యాంకులద్వారా పొందిన రుణాలను రద్దుచేయాలని; రైతులవద్ద నిల్వవున్న ధాన్యమంతటినీ తేమశాతంతో నిమిత్తంలేకుండా కొనుగోలుచేయాలని; బలవన్మరణాలకు, గుండెపోటులకు మరణించిన కుటుంబాలకు 5 లక్షల రూ॥ అందించాలని; ఎన్.ఆర్.ఇ.జి.ఎస్‌ను అన్ని గ్రామాలలో ప్రారంభించాలని, కూలీని 200 రూ॥, పెంచాలనీ డిమాండ్ చేసింది.

చాషీమూలియా సంఘ్ (ఒడిషా) ఈ డిమాండ్లపై తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నది. ఒడిషా ప్రజలకు తమ సమస్యల ఎడల ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్య స్వభావం పట్ల సుదీర్ఘ చేదు అనుభవాలున్నాయి. నిలకడైన , నిర్మాణయుతమైన ఐక్య ఉద్యమం ద్వారా మాత్రమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకోవటం సాధ్యం అవుతుంది. D

# రాజకీయ మార్పును కోరుతూ ట్యునీసియాలో ప్రజావెల్లువ




| | | |
|---|---|---|
| వైశాల్యం | : | 1,63,630 చ.కి.మీ |
| జనాభా | : | 1,04,32,500 |
| రాజధాని | : | ట్యునిస్ |
| అధికార భాష | : | అరబిక్ |
| రెండవ భాష | : | ఫ్రెంచి |
| మతం | : | ఇస్లాం |
| స్థూలజాతీయాదాయం | : | 86,08,600కోట్ల డాలర్లు |
| తలసరి ఆదాయం | : | 3851 డాలర్లు |
| ద్రవ్యం | : | దీనార్ |
| ఎగుమతులు | : | చమురు, ఆహారధాన్యాలు |
| జీవన ప్రమాణం | : | పు. 73 సం॥, స్త్రీ 77 |

**ఉత్తర** ఆఫ్రికాలో మధ్యధరా సముద్రం పశ్చిమ తీరానవున్న చిన్న దేశం ట్యునీసియాలో ప్రజా వెల్లువ పెల్లుబికింది. ఈ వెల్లువ ధాటికి నిరంకుశ పాలకుడు జిన్ఎల్అబిద్నిబెన్ఆలీ 2011 జనవరి 14 అర్ధరాత్రి విమానంలో దేశం వదిలి పారిపోయాడు. తలదాచుకునే చోటుకోసం వెదకుతూ ఆ విమానంలో గంటలకొలదీ మధ్యధరా సముద్రంపై ఎగురుతూ గడిపాడు. అతనికి ఆశ్రయమిచ్చేందుకు ఫ్రాన్సు నిరాకరించింది. చివరికి సౌదీఅరేబియా ఆశ్రయమిచ్చింది. ఇలాంటి నిరంకుశ పాలకులు సాధారణంగా మొదట చేరేదక్కడికే. బెన్ఆలి ప్రభుత్వాన్ని కూలద్రోసిన ఘటనల క్రమం ఇలాసాగింది.

1. 2010 డిసెంబరు17న 26 ఏళ్ళ పిజి డిగ్రీకల నిరుద్యోగి మహమ్మద్ బౌజౌజ్‌ను అనుమతి లేకుండా రోడ్డుప్రక్కన పండ్లు, కూరగాయలు అమ్ముతున్న "నేరాని"కి పోలీసులు అవమానించి కొట్టారు. దీనికి నిరసనగా తన స్వస్థలమైన సిది బౌజిద్‌లోని పోలీసుస్టేషన్ ముందు ఆత్మాహుతి చేసుకున్నాడు. అదేరోజు ఆస్పత్రిలో మృతిచెందాడు. ఆ మరురోజు మరోయువకుడు "నిరుద్యోగం పోవాలి" "దారిద్ర్యంపోవాలి" అని నినాదాలిస్తూ విద్యుత్తు తీగలు పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనితో వరుస ఆత్మహత్యలుసాగాయి. దీనితో ప్రజాగ్రహం కట్టలు తెగి వెల్లువలా పైకెగిసింది.

2. ప్రభుత్వం అత్యయిక పరిస్థితినీ, కర్ఫ్యూనూ విధించింది. 23 ఏళ్ల నిరంకుశ పాలనతో విసిగిపోయిన జనం వెనక్కి తగ్గలేదు. బెన్ఆలీ ప్రభుత్వంపై వారి ఆగ్రహం పూర్తిస్థాయిలో ప్రజావెల్లువ రూపం తీసుకుంది. కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, ఉపాధ్యాయులు, లాయర్లు, పత్రికా రచయితలూ ప్రజా ప్రతిఘటనలో పాల్గొన్నారు. ప్రజావెల్లువ సాయుధ బలగాల్లో సంక్షోభం తెచ్చింది. ప్రజలపై కాల్పులు జరిపేందుకు సైన్యం నిరాకరించటంతో సంయుక్త దళాధిపతి జనరల్ రషీద్ అమర్‌ను బెన్ఆలీ పదవి నుండి తొలగించాడు.

3. నిరసనకారులను "ముసుగులు ధరించిన గూండాలు", "అతివాదానికీ, టెర్రరిజానికీ ఆత్మలు తాకట్టు పెట్టిన, విదేశాలకు అమ్ముడు పోయిన అసాంఘిక శక్తుల"ని బెన్ఆలి మొదట నిందించాడు. అయితే తన పాలన మూలస్థంభాలు కదిలిపోతున్నాయని గుర్తించగానే అంతరంగిక వ్యవహారాల శాఖా మంత్రిని తొలగించటం, అవినీతిపై విచారణకు కమిటీ నియామకం వంటి చర్యలు తీసుకున్నాడు. 2011 జనవరి 13న ప్రజలకు ఎక్కువ స్వేచ్ఛలూ యిస్తాననీ, సంస్కరణలు తెస్తాననీ, 2014లో మళ్లీ పదవికి పోటీ చేయకుండా దిగిపోతాననీ వాగ్దానాలు చేశాడు. అయితే ప్రజానీకం వీటిని పట్టించుకోలేదు. "బెన్ ఆలీ దిగిపో" అని ముక్త కంఠంతో నినదించారు.

4. బెన్ ఆలీ దేశం వదిలి పారిపోయాడు. కొద్దిగంటల్లోనే స్పీకరు షౌద్ మెబజ్జా తనను తాను అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. బెన్ ఆలీ ప్రభుత్వాన్నీ, పార్లమెంటునూ రద్దుచేసి, మధ్యంతర 'జాతీయ ఐక్యతా' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించాడు.

5. ప్రజల ఆగ్రహమూ, నిరసన అనేక రూపాలలో సాగింది. వారు ప్రభుత్వ భవనాల మీదా, బెన్ ఆలీ పార్టీ ఆర్‌సిడి కార్యాలయాల మీదా దాడులు చేశారు. బెన్ ఆలీకీ, అతని భార్యకు చెందిన వ్యాపారాలూ, ఆస్థులను లక్ష్యంగా పెట్టుకుని దాడులు చేశారు. బెన్ ఆలీ అల్లుడి భవనాలనూ, వాణిజ్య సముదాయాలనూ, అతని కుటుంబీకుల కార్లను తగులబెట్టారు. బెన్ ఆలీ మేనల్లుడిని చావగొట్టారు. అనేకచోట్ల పోలీసులతో ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో వందమంది వరకూ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

## స్థూల చరిత్ర

క్రీస్తుపూర్వం నుండి నాగరికత వెలసిన దేశమిది. రోమన్ సామ్రాజ్యంలోనూ, అట్టోమాన్ సామ్రాజ్యంలోనూ భాగంగా వుండేది. 1850 నుండి ఫ్రెంచి వలస పాలనలో నలిగిపోయింది. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మన్ దురాక్రమణకు గురైంది. ఎడారి ఇసుక రేణువుల ప్రతిఘటనా తుఫానులో చిక్కుకుని ఆధునిక సైనిక తంత్ర నిపుణుడిగా పేరుగాంచిన జర్మనీ జనరల్ రోములస్ ఓటమి పాలైనాడు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం జాతీయ విమోచనోద్యమాల వెల్లువలో భాగంగా ట్యునీసియాలో వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమం సాగింది. ఫలితంగా 1956లో స్వాతంత్ర్యాన్ని పొందింది. జాతీయోద్యమ నాయకుడు బౌర్‌జీబా అధ్యక్షుడిగా ప్రభుత్వమేర్పడింది. జాతీయోద్యమ స్ఫూర్తితో దేశాన్ని నడిపేందుకు పూనుకున్నాడు. పాత వలస రాజ్యాలు వదలిన చెప్పుల్లో కాళ్లుదూర్చి ఆధిపత్య స్థాపనకు పూనుకున్న అమెరికా సామ్రాజ్య వాదం వలస పాలన నుండి బయటపడిన దేశాలన్నింటిలోలాగే, ట్యునీసియాలోకీ ప్రవేశించింది. సహాయం పేరిట ప్రపంచబ్యాంకు, ఐయంఎఫ్‌లు కోరలు సాచాయి. 1980 దశకం వచ్చేసరికి అవి దేశ ఆర్థిక విధానాలను నిర్దేశించే పట్టును సాధించాయి.

1980లలో అంతర్జాతీయ ద్రవ్యనిధి ట్యునీసియాపై సంస్థాగత సర్దుబాట్ల కార్యక్రమాన్ని రుద్దింది. ప్రజలకిస్తున్న అన్ని రకాల సబ్సిడీలనూ దిగకోయమని ఆదేశించింది. 1984 జనవరిలో ప్రభుత్వం ఆహారసబ్సిడీ తగ్గింపులో భాగంగా రొట్టెధరను రెట్టింపు చేసింది. దీనితో ఆగ్రహించిన ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. రాజధాని ట్యునిస్‌లో సాగిన ప్రజాందోళనపై పోలీసు కాల్పులు సాగి 50 మంది మరణించారు. ఈ ఘటన జరిగిన పదినిమిషాల్లోనే అధ్యక్షుడు బౌర్‌జీబా రేడియోలో దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించాడు. అంతరంగిక శాఖామంత్రిని తొలగించినట్లూ, రొట్టె ధరను పాతస్థాయికి తగ్గించినట్లూ ప్రకటించాడు. అమెరికా రుద్దుతున్న ఆర్థిక కార్యక్రమాన్ని అమలు జరిపేదిలేదని స్పష్టం చేసాడు. దీనితో ప్రజాందోళన ఆగింది.

కానీ ట్యునీసియా రాజకీయ రంగంలో వ్యక్తమైన జాతీయవాద ధోరణులను అమెరికా సహించలేక పోయింది. ఫ్రాన్సు ప్రభావాన్ని తగ్గించి తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు పూనుకుంది. ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొన్న సంక్షోభంతో పెరిగిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణాలను చూపి, బౌర్‌జీబాను "అసమర్థపాలకుడి"గా ముద్రవేసి 1987లో సైనిక తిరుగుబాటు చేయించింది. సైన్యాధిపతి బెన్ ఆలీని అధ్యక్షుడిని చేసింది. ఫ్రాన్సు ప్రక్కన బెట్టి బెన్ ఆలీ అమెరికా సామ్రాజ్యవాదుల బంటుగా మారాడు. నవంబరులో సైనిక తిరుగుబాటు జరగ్గా డిసెంబరులో ఐ.యం.ఎఫ్.తో ఒప్పందం చేసుకున్నాడు; జనవరిలో యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం చేసుకున్నాడు. వీటి ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరిట విదేశీ కంపెనీల పరం చేశాడు. స్వేచ్ఛావాణిజ్య కేంద్రాలను తెరచి అక్కడి కార్మికుల వేతనాలను 75 సెంట్లుగా నిర్ణయించాడు. పశ్చిమయూరపు దేశాలకు కారుచౌక శ్రమశక్తిని సమకూర్చాడు. 23 ఏళ్ళ పాలనలో బెన్ ఆలీ ప్రపంచ బ్యాంకు నిర్దేశాలను తుచాతప్పక పాటించాడు. ప్రజలకిస్తున్న సబ్సిడీలన్నీ తగ్గించి, ఆహార సరకుల ధరల నియంత్రణ మానివేశాడు. ప్రభుత్వరంగ కార్మికులను పనినుండి తొలగించాడు. ట్యునీసియన్లు పొట్ట చేత పట్టుకుని మృత్యునావల్లో విదేశాలకు వెళ్లారు. 6,50,000 మంది విదేశాల్లో శ్రమిస్తూ 2010లో వారు వెనక్కు పంపిన ధనం 196 వేల కోట్ల డాలర్లు. దీనితో విదేశీ అప్పులు, వాటి వడ్డీలు కట్టుకున్నాడు తప్ప ఈ విదేశీ మారక ద్రవ్యాన్ని దేశాభివృద్ధికి వినియోగించలేదు.

## ప్రజా వెల్లువకు దారితీసిన పరిస్థితులు

ఈ విధానాల ఫలితంగా ట్యునీసియా ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. 15-24 ఏళ్ల వయస్సులోని యువతలో సగం నిరుద్యోగులు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రైవేటీకరణతో ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయి. ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. అవినీతితోనూ, ప్రభుత్వ ఆస్థులు కొల్లగొడుతూనూ కొద్దిమంది సంపదలు పోగేసుకుంటుండగా, శ్రామిక వర్గాలూ, మధ్య తరగతి జనులూ ఆకలి, దారిద్ర్యంలో కూరుకుపోయారు. మధ్యధరా సముద్రపు ఆవలి తీరాన ఉపాధి కొరకు పడవలలో ప్రయాణించి మృత్యువాతపడుతున్న యువకుల జీవితాలు రోజువారీ వార్తలై 'మృత్యునావ'లన్న పేరు స్థిరపడి పోయింది. స్వేచ్ఛా వాణిజ్య కేంద్రాల్లోని వస్త్ర పరిశ్రమలో వేతనాలు హీనస్థాయిలో వున్నాయి. అయినా ఐ.యం.ఎఫ్. ఆదేశాల ప్రకారం బెన్ ఆలీ ఆహారం, పెట్రోలు ధరలు పెంచివేశాడు. అవినీతి, అక్రమార్జనలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. బెన్ ఆలీ, అతని భార్య వారి బంధుగణం దేశసంపదలో 50 శాతాన్ని కైవశం చేసుకున్నారు.

అయినా ప్రపంచ బ్యాంకు 7 శాతం మాత్రమే దారిద్ర్యంలో వున్నారనీ, దేశం గణనీయంగా అభివృద్ధి చెందిందనే కితాబులిచ్చింది. 93 శాతం మించి ప్రజలకు కనీస అవసరాలన్నీ తీర్చుకోగల ఆదాయం వస్తుంటే ఇంత అశాంతి, తిరుగుబాటు వచ్చివుండేవికావు.

సామ్రాజ్యవాదుల పనుపున బెన్ ఆలీ నిరంకుశ పాలన సాగించాడు. ప్రతిపక్షాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు. ఛాందసవాద ప్రమాదాన్ని తప్పించటమన్న సాకుతో ఉదార బూర్జువా మతవాద ధోరణులున్న ప్రధాన ప్రతిపక్షపార్టీపై 1990లో దాడి సాగించాడు. ఆ తర్వాత జాతీయవాదులు, వామపక్ష శక్తులు, ఉదారవాదులు, విద్యార్థి నాయకులపై విరుచుకుపడ్డాడు. ఎన్నికల్లో తనకు 97 నుండి 99 శాతం ఓట్లు పడ్డాయన్న అతని మాటలే ఎన్నికలెంత తంతుగా నడిచాయో తెలుపుతుంది. ట్రేడ్‌యూనియన్లనూ, మానవహక్కులనూ, సాంస్కృతిక, సామాజిక సంస్థలనూ, చివరకు క్రీడా సంస్థలనూ కూడా బెన్ ఆలీ ప్రభుత్వం అనుమతించలేదు. ఒక పత్రికా రచయిత వాఖ్యానించినట్లు "ప్రజలు కలుసుకునేందుకు మిగిలిన ఏకైక స్థలం జైలు". పత్రికా విలేఖరులను జైళ్లలో కుక్కాడు. విదేశీ పత్రికా విలేఖరులను దేశంలోకి అనుమతించలేదు. ప్రజావెల్లువ వార్తలు తెలుసు కునేందుకు సెల్‌ఫోనులతో తీసి పంపిన చిత్రాలే ఆధారమయ్యాయి.

ఆ నిరంకుశపాలనలో ప్రజలకు ఊపిరాడని స్థితి ఏర్పడింది. ఎప్పుడైనా అంటుకుని దావానంలా వ్యాపించే ఆగ్రహం వారిలో పేరుకు పోయివుంది. పండ్లు, కూరగాయలు అమ్ముకుంటున్న నిరుద్యోగిపై సాగిన దురంతం దీనికి ఆజ్యం పోసింది. ప్రజాగ్రహం పెను వుప్పెనగా జ్వలించింది.

## నూతన అధికారం కోసం పోరాటం

బెన్ ఆలీ ప్రభుత్వం కూలిపోయేముందు ట్యునీసియాలోని దోపిడీ పాలక వర్గాలూ, వారి సామ్రాజ్యవాద యజమానులూ ప్రజావెల్లువపై బురద జల్లేందుకూ, అణచివేసేందుకూ అన్నిరకాల పద్ధతులనూ ప్రయోగించారు. అయినా ప్రజావెల్లువ ఆగకపోవటంతో ఆరోజే కనుగొన్నట్లు బెన్ ఆలీ అత్యంత నిరంకుశ పాలకుడనీ, అతనే ఈ సంక్షోభానికి కారకుడనీ, అతన్ని పదవీచ్యుతుడ్ని చేస్తే సమస్య తీరిపోయినట్లు మాట్లాడటం మొదలు పెట్టారు. సామ్రాజ్యవాద పత్రికలన్నీ ఈ పాటే పాడాయి. తమకు సేవ చేసిన నమ్మినబంటును దేశం దాటించి చెత్తబుట్టలో పడేశాయి. జాతీయ ఐక్యతా మధ్యంతర ప్రభుత్వమన్నది ఈ ప్రయత్నాలలో భాగంగా ఏర్పడిందే. ప్రజా వెల్లువకు నాయకత్వం వహించిన జనరల్ యూనియన్ ఆఫ్ ట్యునీసియన్ వర్కర్స్ (యుజిటిటి) ప్రతినిధులు ముగ్గురిని ఈ ప్రభుత్వంలో మంత్రులుగా చేర్చుకున్నారు. బెన్ ఆలీ పార్టీ ఆర్‌సిడి నాయకులతో మంత్రి వర్గాన్ని నింపారు. రక్షణ-విదేశీ వ్యవహారాలు, ఆర్థికం, అంతరంగిక వ్యవహారాలు వంటి కీలక మంత్రిత్వశాఖలన్నీ బెన్ ఆలీ అనుయాయులతో నింపారు. ఈ మధ్యంతర ప్రభుత్వం కొత్త సీసాలో పాత సారాయి అయింది. కొన్ని ప్రతిపక్ష శక్తులకు కొన్ని శాఖలిచ్చి వారినోళ్లు కట్టివేశారు. ఇది ప్రజా వెల్లువను వమ్ము చేసే ప్రయత్నం.

కొత్త ప్రభుత్వంలో ఆర్‌సిడి నాయకులను మంత్రులుగా చేయటాన్ని నిరసిస్తూ 24 గంటల్లో యుజిటిటి ప్రతినిధులు మంత్రిపదవులకు రాజీనామా చేశారు. దీనితో మంత్రివర్గం నుండి ఆర్‌సిడి నాయకులను తొలగించాలన్నది నిరసనకారుల నినాదమైంది. వీరిని తొలగించి జాతీయ పరిష్కార ప్రభుత్వాన్ని ఏర్పరచాలంటూ యుజిటిటి నాయకత్వాన ప్రజాప్రదర్శనలు సాగు తున్నాయి. పోలీసులు కూడా ఆందోళనలో చేరుతున్నారు. జాతీయ ఐక్యత అన్న ప్రభుత్వం అణచివేత చర్యలు తీసుకుంటూనే, పాత ప్రభుత్వం నుండి "పూర్తి తెగతెంపులు" చేసుకుంటానని వాగ్దానం చేస్తున్నది. అయితే "పూర్తి తెగతెంపులు" సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు రుద్దిన నయాఉదారవాద సంస్కరణలనుండి తెగ తెంపులుగా వుంటాయని చెప్పటం లేదు. రాజకీయ ఖైదీల విడుదల, రాజకీయ పార్టీల ఏర్పాటుకు చట్టం వంటి సంస్కరణలు చేస్తానని వాగ్దానం చేస్తున్నది. ప్రజల కోపాన్ని తగ్గించేందుకు బెన్ ఆలీతో సంబంధంవున్న కొందరిని అరెస్టు చేయటంవంటి చర్యలను ప్రధానమంత్రి ఘన్నౌఛీ తీసుకున్నాడు. అయితే ప్రజలీ ప్రభుత్వాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్నారు. ఎటూ తేలని స్థితిలో ఇప్పటి పరిస్థితి వుంది. అది ఏ వైపుకు దారితీస్తుందన్నది వేచిచూడాల్సి వుంటుంది.

## ప్రజా వెల్లువ భవితవ్యం

అధికార బలంతోనూ, ఆయుధ సంపత్తితోనూ పాలన సాగించగలమని విర్రవీగిన నిరంకుశపాలకు లందరూ పీడిత ప్రజా తిరుగుబాటు ముందు వీగిపోయారు. చరిత్ర చెత్తబుట్టలో చేరారు. బెన్ ఆలీ కూడా ప్రజా వెల్లువ ముందు కూలిపోయాడు.

ప్రజావెల్లువకు అవసరమైన భౌతిక పరిస్థితివుంది. అవి ప్రజావెల్లువను-అప్రయత్న పూర్వక వెల్లువనూ, ట్యునీసియాలో జరిగినట్లు కొంత మేరకు నిర్మాణయుతంగానూ-తెచ్చాయి. అయితే ఈ వెల్లువ తనంత తాను ఈ సామాజిక వ్యవస్థను మార్పు చేసే విప్లవంగా పరివర్తన చెందజాలదు. కొన్ని సందర్భాల్లో ఓటమికి గురికావచ్చు. లేదా ప్రభుత్వాధినేతల మార్పును తేవచ్చు; కొన్ని సంస్కరణలనుతేవచ్చు. ట్యునీసియా పరిణామాలు రాజకీయ పరిస్థితిలో మార్పును తెస్తాయన్నది నిస్సందేహం. ఆ మార్పు ప్రజానుకూలంగా ఏ మేరకు ఉంటుందన్నది ప్రజా వెల్లువను నడుపుతున్న వారిపై ఆధారపడివుంటుంది.

ప్రజావెల్లువను తమకనుకూలంగా మలుచుకుని తమ దోపిడీపాలనను కొనసాగించేందుకు దోపిడీ వర్గాలు సకల ప్రయత్నాలూ చేస్తాయి. తమకు సేవలందించి అప్రదిష్టపాలైన పాలకుడిని వదిలి, మరో సేవక పాలకుడిని ప్రజావెల్లువ మొగదల నిలిపేందుకు పూనుకుంటాయి. ట్యునీసియాలో నేడు జరుగుతున్నది ఇదే. ఒక వేళ ప్రజాశక్తులు పైచేయి కలిగిన ప్రభుత్వ మేర్పరచగలిగినా, అనేక బూటకపు నినాదాలతో దానిని తన కనువుగా మలుచుకునేందుకూ ప్రయత్నాలు చేస్తాయి. ఫిలిప్పైన్సులో ప్రజా వెల్లువ అగ్రభాగాన నిలిచిన ఆక్వినో సారధ్యంలోని ప్రభుత్వాన్ని ఆర్థిక మీటలతో తమకనువుగా మలుచుకున్న అనుభవం మన ముందువుంది. అలా ట్యునీసియా జాతీయోద్యమ నాయకుడు బౌర్‌జీబా ప్రభుత్వాన్ని ఆర్థిక మీటలతో బిగించి అసమర్థుడని తొలగించిన అనుభవం కూడా ట్యునీసియా ప్రజల ముందుంది. ప్రజావెల్లువ విజయవంతమై ప్రజానుకూల ప్రభుత్వం ఏర్పడి కొనసాగాలన్నా, సామాజిక వ్యవస్థ మార్పుకు అది దారితీయలన్నా పీడిత వర్గ ప్రయోజనాలే పరమావధిగాగల రాజకీయ శక్తులూ, నిర్మాణమూ వెల్లువకు నాయకత్వం వహించి నడిపించాల్సి వుంటుంది. అదిమాత్రమే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగలదు.

నేడు ట్యునీసియాలో పాత ప్రభుత్వంలో ఆధిపత్యం వహించిన శక్తులను తొలగించాలని కోరుకుంటున్న వర్గాలకూ, శక్తులకూ-మారిన రూపంతో పాత శక్తుల ఆధిపత్యాన్నే కొనసాగించాలన్న వర్గాలకూ, శక్తులకూ మధ్య తీవ్రపోరాటం సాగుతున్నది. ప్రతీపశక్తులకు సహకారమిచ్చి పాత అధికార శక్తుల పాలనను తిరిగి నెలకొల్పి కోల్పోయిన తన ప్రాభవాన్ని తిరిగి పొందాలని ఫ్రాన్సు సామ్రాజ్య వాదం ప్రయత్నిస్తుండగా, ఈ ఘర్షణలో తనకనుకూల శక్తులే అధికారంలోకి వచ్చే ప్రయత్నాలను అమెరికా సామ్రాజ్యవాదులు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రత్యేకించి గత రెండు దశాబ్దాలుగా అరబ్, ముస్లిం ప్రజలపై తాము సాగిస్తున్న యుద్ధాలతో వారిలో పేరుకు పోతున్న ఆగ్రహం కట్టలు తెంచుకుని పెల్లుబుకుతుందన్న భయం సామ్రాజ్యవాదులందరికీ ఉంది. ఈజిప్టు, లెబనాన్ తదితర అరబ్ దేశాలలో ప్రజానిరసనలు ఊపందుకుంటున్నాయి. దీనితో ట్యునీసియా ప్రజా వెల్లువను అణిచే వివిధ పద్ధతులను, మార్గాలను వినియోగించే పనిని సామ్రాజ్యవాదులు ముమ్మరం చేస్తారు.

ప్రజావెల్లువను వమ్ముచేసే దోపిడీ వర్గాల, సామ్రాజ్యవాదుల ప్రయత్నాలను ట్యునీసియాలోని ప్రజాశక్తులు ఇంతవరకూ ఎదుర్కొని నిలవటం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ ఘర్షణలో అంతిమ విజయం ఎవరిదన్నది సాగుతున్న పోరాటక్రమం నిర్ణయిస్తుంది.

రాజకీయ మార్పు కొరకు పోరాడుతున్న శక్తులు పైచేయి పొందితే ప్రజలకు కొన్ని హక్కులు రావటానికీ, జీవన పరిస్థితుల్లో కొంత మెరుగుదలకూ అవకాశాలు ఏర్పడుతాయి. పోరాట అనుభవాలు ప్రజల చైతన్యాన్ని మరో మెట్టు ఎక్కిస్తాయి. ఇది శుభపరిణామం.

అదే సమయంలో భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీ అణచివేతల కాడిని తప్పిస్తే తప్ప సమూల సామాజిక మార్పు సాధ్యంకాదన్న, లేదంటే తాము తెచ్చిన రాజకీయ మార్పు కూడా తిరోగ మిస్తుందన్న, చైతన్యాన్ని ప్రజలలో రగుల్కొలపవలసిన కర్తవ్యం అగ్రగామిశక్తులపై వుంది. నిరంకుశ పాలనకు వ్యతిరేక పోరాట కొలిమిలో కాలుతూ, కాకలు తీరుతున్న ట్యునీసియా ప్రజలు ఆ దిశగా పయనిస్తారని ఆశిద్దాం.

30-1-2011

# ఆసియాలో అమెరికా పట్టును బలీయంచేసే పైప్‌లైన్

**తుర్కుమెనిస్తాన్,** ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, భారత్‌లు(టిఏపిఐ-తాపి) పైపులైను నిర్మాణ ఒప్పందంపై 2010 డిసెంబరు 11న సంతకాలు చేశాయి. ఈ సహజ వాయువు పైపులైనుపై ఒక ప్రాథమిక ఒప్పందం ఈ నాలుగు దేశాలమధ్య 2008 ఏప్రిల్ 25న జరిగింది. ఈ 1680 కి.మీ.ల పొడవైన ఈ పైపులైను ప్రాచీన వాణిజ్య రహదారి జన"పట్టుదారి" వెంట సాగి మధ్యఆసియాను దక్షిణాసియాతో కలుపుతుంది. తుర్కుమెనిస్తాన్‌లోని దౌలతాబాదు చమురుక్షేత్రంవద్ద ప్రారంభమైన పైపులైను 145 కి.మీ.సాగి ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రవేశిస్తుంది. అక్కడ హెరాత్, హెల్మండ్, కాందహార్‌ల ద్వారా 735 కి.మీ. సాగి పాకిస్తాన్‌కు చేరుతుంది. పాకిస్తాన్‌లో క్వెట్టా, ముల్తాన్ పట్టణాలను తాకుతూ 800 కి.మీ. సాగి ఫజిలా వద్ద భారత్‌కు చేరుతుంది. పాకిస్తాన్‌లో పైపులైను చీలి రేవుపట్టణం గ్వాదార్‌ను చేరుతుంది.

ఈ ప్రతిపాదిత పైపులైనుకు 760 కోట్ల డాలర్ల వ్యయమౌతుందని 2008లో అంచనా వేశారు. దీనికి ద్రవ్య వనరులు సమకూర్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ముందుకొచ్చింది. అనేక కంపెనీల కూటమి ఈ పైపులైను నిర్మాణాన్ని నిర్వహణను చేపడతాయి. ఈ నాలుగు దేశాలూ అంతర్జాతీయ టెండర్లద్వారా దానిని ఎంపికచేస్తాయి. ఈ పైపులైనుకు 90 ఎంఎంఎస్‌సియండి (రోజుకు పదిలక్షల ప్రామాణిత ఘనపు మీటర్లు) సహజ వాయువును తరలించే సామర్థ్యం వుంటుంది. దీనిలో భారత, పాకిస్తాన్‌లు చెరి 38 యంయంఎస్‌సియండిల వాయువును పొందుతాయి. తుర్కుమెనిస్తాన్‌లోని సహజ వాయువును ఈ పైపులైనుద్వారా పశ్చిమయూరపుకు తరలించవచ్చు. ఇదికాక కాస్పియన్ సముద్రంలో పైపులైనువేసి పశ్చిమ యూరపుకు తరలించే ప్రయత్నం కూడా వుంది.

'తాపి' పైపులైను ప్రతిపాదన వెనుక అమెరికా సామ్రాజ్యవాదముంది. 1990ల నుండే అమెరికా ఈ ప్రతిపాదనను సమర్థిస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ల పాలనలో వుండగా రెండు కంపెనీల నాయకత్వంలోని కూటములు దీనికోసం పోటీపడ్డాయి. ఒకటి అమెరికాకు చెందిన చమురు కంపెనీ యూనికాల్ ఆధ్వర్యంలోని కూటమి. రెండవది అర్జెంటీనాకు చెందిన కంపెనీ బ్రిడాస్ కూటమి. అమెరికాయూనికాల్ కూటమిని బలపరిచింది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక "జాతీయ ప్రభుత్వాన్ని" ఏర్పాటు చెయ్యమనీ, అందువల్ల ఈ పైపులైను నిర్మాణానికి నాలుగు ప్రభుత్వాల మధ్యా ఒప్పందం చేసుకునే వీలుంటుందనీ అమెరికా తాలిబన్లను ఒప్పించేందుకు ప్రయత్నించింది. ఆనాటికి 90శాతం దేశం తాలిబన్ల ఆధీనంలో వుంది. అయితే పైపులైను వెళ్లే మార్గంలో పుష్తూన్ జాతులున్నాయి. ఈ పైపులైను నిర్మాణం చేపట్టేందుకు వీలుగా ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక చట్టబద్ధ ప్రభుత్వాన్ని నెలకొల్పమని యూనికాల్ కంపెనీ అమెరికా పార్లమెంటు సభ్యులను కోరింది. కాగా బ్రిడాస్ కంపెనీ అధిపతి 8 నెలలపాటు పుష్తూన్ జాతులతో చర్చలు సాగిస్తూ ఆఫ్ఘనిస్తాన్‌లో గడిపాడు. సహకరించేందుకు వారిని అతను ఒప్పించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. 2001 సెప్టెంబరు 11న ప్రపంచ వాణిజ్య భవనాలపై దాడులు జరగటానికి ముందు జూలైలో ఈ పైపులైను నిర్మాణంపై అమెరికా, తాలిబన్ల మధ్యచర్చలు ఆగిపోయాయి.

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ తర్వాత ఈ పైపులైను నిర్మాణాన్ని అమెరికా మళ్లీ ముందుకు తెచ్చింది. ఆఫ్ఘనిస్తాన్‌లో కీలుబొమ్మ పాలకుడు కర్జాయి దీనిగురించి పాకిస్తాన్, తుర్కుమెనిస్తాన్, భారత్‌తో అనేక విడతలు చర్చించాడు. అందరూ కలిసి దీనికి సహాయ మందించమని ఆసియా అభివృద్ధి బ్యాంకును కోరారు. అందుకు అది సిద్ధమై ప్రాథమిక నివేదికను 2008లో తయారుచేసింది. దీనితో ఈ నాలుగు దేశాలూ 2008లో ప్రాథమిక ఒప్పందాన్ని చేసుకున్నాయి.

ఇది జరుగుతుండగా పాకిస్తాన్, భారత్‌లకు పైపులైనుద్వారా సహజవాయువు సరఫరా చేస్తానని ఇరాన్ ప్రతిపాదించింది. అనేక సంవత్సరాలు మూడుదేశాల మధ్య చర్చలు జరిగి సహజవాయువు ధరను నిర్ణయించుకోగలిగాయి. దీనికి 'తాపి' పైపులైనుకు అయ్యే వ్యయమే దాదాపుగా అవుతుంది. (750 కోట్ల డాలర్లు). ఇక ఒక ఒప్పందం చేసుకోవటమే మిగిలింది. ఆనాటి నుండి దీనినుండి తప్పుకొమ్మని అమెరికా వత్తిడి చేయటంతో భారత ప్రభుత్వం ఊగిసలాటలోపడి, చివరకు ఆ వత్తిడికి లొంగిపోయింది. ఇరాన్‌తో పైపులైనును సమర్థిస్తున్న కేబినెట్‌మంత్రి నట్వర్‌సింగ్‌ను తొలగించింది. ఒక బ్రిటీషు థర్మల్ యూనిట్‌ను 3 డాలర్ల ధరకు సరఫరా చేస్తానని ఇరాన్ చెప్పింది. అయినా భారత ప్రభుత్వం ఇరాన్ పైపులైను నుండి తప్పుకుంది. అదే సమయంలో దేశంలో ఉత్పత్తి అయిన సహజ వాయువును ఒక బి.టి.యూనిటును 4.25 డాలర్లకు అమ్ముకొనమని రిలయన్సు కంపెనీకి అనుమతినిచ్చింది. కాగా ప్రభుత్వ సంస్థ ఒఎన్‌జిసికి మాత్రం 1.70 డాలర్ల రేటును పెంచేదిలేదని చెప్పింది. ఇదిలా వుండగా 'తాపి' పైపులైనుద్వారా వచ్చే సహజవాయువు ధర అంతర్జాతీయ మార్కెట్టులో ధరను బట్టిమారుతుంది. గత ఏడేళ్లుగా అది 8 డాలర్లుగా వుంది. దేశ ప్రయోజనాలు ఏ మాత్రం పట్టని పాలకులు భారత్‌ను ఏలుతున్నారు.

వద్దని అమెరికా వత్తిడి చేస్తున్నా, పాకిస్తాన్ ఇరాన్‌తో ప్రాథమిక ఒప్పందాన్ని 2009 మేలో చేసుకుంది. ఈ పైపులైను నిర్మాణంలో పాలుపంచు కొమ్మని అవి రెండూ చైనాను కోరాయి. ఈ ప్రతిపాదనను చైనా ఈనాటికీ పరిశీలిస్తూవుంది. కాగా రష్యాకు చెందిన గజ్‌ప్రామ్‌కంపెనీ ఈ పైపులైనును నిర్మించి పెడతానని 2010లో ముందుకు వచ్చింది. అమెరికా తన ప్రత్యేకదూతగా రిచర్డ్ హల్ బ్రూక్‌ను పంపి ఈ పైపులైను నుండి తప్పుకుంటే అనేక రాయితీలిస్తానని పాకిస్తాన్‌కు ఆశలు చూపింది. చివరకు 'తాపి' పైపులైను ఒప్పందంపై సంతకం చేసిన పాకిస్తాన్‌ను అమెరికా తన దారిలోకి తెచ్చుకున్నట్లు కన్పిస్తుంది. అయినా పైకిమాత్రం ఇంకా ఇరాన్‌తో పైపులైనును వదిలిపెట్టలేదని పాకిస్తాన్ అంటున్నది.

అమెరికా సామ్రాజ్యవాదం ఇరాన్‌పై కక్షకట్టింది. అది చమురు అమ్ముకోకుండా చేసి లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నది. అదేసమయంలో "శక్తివనరు దక్షిణానికి ప్రవహించే విధంగా మధ్య ఆసియాను దక్షిణాసియాతో కలిపే" 'తాపి' పైపులైనును నిర్మించాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నది.

ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణలో పాలుపంచుకున్న మిగిలిన సామ్రాజ్యవాదులందరూ అక్కడ లభిస్తున్న సహజవనరులను కొల్లగొట్టేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఆర్థిక, సైనిక కార్యకలాపాలను పెంచుకునేందుకు రష్యా పూనుకుంది. 2010 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, తజికిస్తాన్‌లతో నల్లసముద్ర విహార పట్టణం సోచీలో శిఖరాగ్ర సమావేశం నిర్వహించింది. మధ్య ఆసియా నుండి ఆఫ్ఘనిస్తాన్ గుండా పాకిస్తాన్ వరకు రవాణా, చమురు సరఫరా కారిడార్లు రెంటిని నిర్మించాలని అవి నిర్ణయించాయి. ఈ దేశాలకు ఆర్థిక, రాజకీయ, సైనిక భద్రతను సమకూరుస్తానని రష్యా ప్రతిపాదించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో 140పారిశ్రామిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మించిపెడతానని, రష్యా ప్రధాని మెద్వదేవ్ ప్రతిపాదించాడు. ఇదే జరిగితే ఆఫ్ఘనిస్తాన్‌లోని చమురు, సహజవాయువు, ఖనిజాల రంగంలోకి రష్యా పెట్టుబడులు ప్రవహిస్తాయి. ఆయుధాల సరఫరా, పోలీసులకు శిక్షణ మొదలగు వాటితో ఆఫ్ఘనిస్తాన్‌లో సైనికంగా ప్రవేశించే ప్రయత్నం రష్యా చేస్తున్నది. జర్మనీ, జపాన్, చైనాలు కూడా ఈ వనరులపై కన్నువేశాయి. హిందుకుష్ పర్వతశ్రేణి పాదాలవద్ద వున్న బంగారు గనుల తవ్వకాన్ని చైనా మొదలుపెట్టింది. ఈ తవ్వకాలతో అక్కడవున్న ప్రాచీన బౌద్ధగుహాలయాలు దెబ్బతింటాయంటూ, తాలిబన్లు బౌద్ధ విగ్రహాలను ధ్వంసం చేసిన చర్యతో దీనిని సరిపోలుస్తూ పశ్చిమదేశాల పత్రికలు ప్రచారం ప్రారంభించాయి. ఆఫ్ఘనిస్తాన్‌లోని సహజవనరులను కబళించేందుకు సామ్రాజ్యవాదుల మధ్య పోటీ తీవ్రమవటాన్ని ఇది తెలుపుతున్నది. రాబోయే రోజుల్లో ఇది మరిన్ని ఉద్రిక్తతలకు దారితీస్తుంది.

'తాపి' పైపులైను సమస్యల మయం. విదేశీ దురాక్రమణకు వ్యతిరేకంగా తీవ్ర ప్రతిఘటనను ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు సాగిస్తున్న ప్రాంతం గుండా ఈ పైపులైనును నిర్మించాల్సివుంది. ఈ ఒప్పందం చేసుకున్న కర్జాయి ప్రభుత్వానికి ప్రజామోదం లేదు. అమెరికా సైనికబలంతో అది నిలబడివుంది. ఈ పైపులైను వేయనున్న హెల్మండ్, కాందహార్ రాష్ట్రాల్లో అమెరికా తన సైనిక దాడులను కేంద్రీకరించింది. పైపులైనుకు రక్షణ కల్పించేందుకు తమ సైన్యం అక్కడలేదంటూనే కెనడా రక్షణమంత్రి పైపులైనుపై దాడులు జరిగితే మా పాత్ర మేము నిర్వహిస్తామని ప్రకటించాడు. పైపులైనుకు భద్రత కల్పించటం మా పని కాకపోయినా, ప్రభుత్వం అడిగితే భద్రత కల్పిస్తామని నాటో ప్రకటించింది. పైపులైను నిర్మాణం, నిర్వహణకోసం అమెరికా, నాటో కూటమి పూనుకుంటాయన్నది స్పష్టమే. ఆసియా అభివృద్ధి బ్యాంకులో అమెరికా, జపాన్‌లతోపాటుగా కెనడా, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్సు, జర్మనీలకు కూడా వాటాలున్నాయి. 'తాపి' పైపులైను భద్రత వాటికి ముఖ్యమైనది. ఈ విధంగా ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైన్యాలు తిష్టవేయటానికీ, అక్కడి సహజవనరులపై ఆధిపత్యం పొందటానికి 'తాపి' పైపులైను ఒక సాకు అవుతుంది.

అల్‌ఖైదానూ, టెర్రరిస్టులనూ అణచేపేరిట పాకిస్తాన్ భూభాగంపై అమెరికా వైమానిక దాడులు సాగిస్తున్నది. పైపులైనులో కొంతభాగం ఈ ప్రాంతం గుండా రావాలి. అమెరికా దురాక్రమణలో పాకిస్తాన్ ప్రభుత్వం చేయికలపటం, ఇప్పటి వైమానిక దాడులతో పాకిస్తాన్ ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. దురాక్రమణ జరిగిన తర్వాత పునర్నిర్మాణంలో భారత్ పాలుపంచుకోవటం కూడా ఆఫ్ఘన్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. భారతీయులపై దాడులూ సాగాయి.

'తాపి' పైపులైను భద్రత కల్పించేందుకు నాటోలో కూటమి దేశాలు అంగీకరించి అమెరికాతో సహకరిస్తాయా లేదా అని సామ్రాజ్యవాద పత్రికలు చర్చిస్తున్నాయి. అయితే మరో ప్రశ్న కూడా వుంది. 'తాపి' పైపులైను నిర్మాణానికి అమెరికా దురాక్రమణను ప్రతిఘటిస్తున్న ఆఫ్ఘన్ ప్రజలు అంగీకరిస్తారా? తుపాకీ పాలన నీడలో అంగీకరింప చేయటం సాధ్యంకాదు. పైపులైను నిర్మాణం జరిగి, సరిగ్గా నడపాలంటే సంబంధిత దేశాలలో శాంతి నెలకొనాలి. అమెరికా దురాక్రమణ అంతమయ్యేవరకూ ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి నెలకొనదు. సైనిక ఉపసంహరణ జపంచేస్తూనే, సైనిక దురాక్రమణను కొనసాగించే ప్రయత్నాలలో అమెరికా నిమగ్నమై వున్నందున, "అభివృద్ధి" నినాదం ఆఫ్ఘన్ ప్రజలను వంచించలేదు.

తక్కువ ధరకు నాలుగేళ్లలో సహజవాయువు సరఫరా చేయగల ఇరాన్‌తో పైపులైను నిర్మాణాన్ని ప్రక్కనబెట్టి, అమలుజరుగుతుందన్న ఆశలేని 'తాపి' పైపులైనును భారత ప్రభుత్వం ఎంచుకుంది. ప్రజల, దేశ ప్రయోజనాలు నెరవేర్చటంకంటే సామ్రాజ్యవాద యజమానులకు సేవచేయటమే తన కర్తవ్యమని మరోసారి స్పష్టంచేసింది.

D

# పాకిస్తాన్ సాల్మన్‌తసీర్ హత్యకు ప్రజాస్వామిక నిరసన

**2011** జనవరి 4న ఇస్లామాబాద్‌లో పంజాబు రాష్ట్ర గవర్నరు సాల్మన్‌తసీరును అతని అంగరక్షకుడు మాలిక్ ముంతాజ్ ఖాదిర్ హత్య చేసిన వార్త ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక శక్తులకు శరాఘాతమైంది.

ఈ హత్య అర్థంకాని చర్యకాదు; ఆ నేరాన్ని చేసిన వారందుకు చింతించలేదు. ఒక పథకం ప్రకారం ముస్లిం ఛాందస వాదశక్తులు సాగించిన హత్య ఇది. ముందు పీకేనలిచిన వారిని నిర్మూలించటం ద్వారా పాకిస్తాన్‌లో ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక, ఉదారవాద శక్తులను నిలువరించాలన్న పథకంలో భాగంగా ఇది జరిగింది.

జుల్ఫికర్ అలీ భుట్టో నాయకుడిగావున్న పాకిస్తాన్ పీపుల్సు పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా సాల్మన్ తసీర్ 1960లో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. తసీర్ మొదటి నుండి ఉదారవాదిగానూ, ప్రజాస్వామిక, లౌకిక వాదిగానూ వుంటూవచ్చారు. ప్రఖ్యాతకవి ఫైజ్ అహ్మద్‌ఫైజ్‌కు మేనల్లుడేగాక ఆయన భావాల నుండి స్ఫూర్తి పొందాడు. జియా ఉల్‌హక్ పాలన కాలంలో చేసిన దైవ దూషణ చట్టాలను వ్యతిరేకించినందుకు జైలులో నిర్బంధించారు. ఉడకబెట్టిన చిక్కుడు గింజలు అరప్లేటు భోజనంతోనే ఆయన అనేక నెలలు గడిపారు. శారీరక హింసకు కూడా గురయ్యాడు.

గత ఐదు దశాబ్దాల్లో పాకిస్తాన్‌లో అనేక రాజకీయ పరిణామాలు వచ్చాయి. సైన్యానికి, పౌరపాలన అనేదానికీ మధ్య అధికారం మారుతూ వచ్చింది. ఈ కాలమంతటా తసీర్ తాను నమ్మిన భావాలకే కట్టుబడి వున్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకికశక్తుల వేధింపుకూ, వారిపై దాడులకూ ఛాందసవాద శక్తులకు సాధనంగా మారిన దైవదూషణ చట్టాలను ఆయన వ్యతిరేకిస్తూనే వచ్చారు. వాటిని "నల్లచట్టాలు"ని పిలిచి, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. మైనారిటీలుగా అహ్మదీయులపై దాడులు జరిగినప్పుడల్లా ఆయన వాటిని ఖండించారు. 2010 మేలో లాహోర్‌లోని రెండు మసీదులపై టెర్రరిస్టు దాడి చేసిన ఛాందసవాదులు 80 మంది అహ్మదీయులను చంపారు. సాల్మన్ తసీర్ ఈ దాడిలో గాయపడినవారిని ఓదార్చి వారికి అండగా నిలిచారు. దీనితో ఛాందసవాదులు ఆయన మహమ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా మాట్లాడి దైవదూషణ చేశాడన్న నిందారోపణ చేశారు. అయినా ఆయన భయపడలేదు. "కాలిపోయే చెక్కతో నేను తయారు కాలేదు"ని ప్రకటించాడు. నీ కాళ్లకు సంకెళ్ల వేసినా ముందుకే నడువు. ప్రాణం పోయినా ఆశయం కోసమే నిలబడు" అని చెప్పాడు.

ముషారఫ్, నేటి పాలకులూ దైవదూషణ చట్టాలను సవరిస్తామని వాగ్దానాలు చేస్తూ వచ్చారుగానీ ఛాందసవాద శక్తులకు లొంగి చేయికలుపలేదు. ఈ ఛాందసవాదులు సాల్మన్ తసీర్‌ను "ఉదార ఉగ్రవాది" అని ముద్రవేశారు. దైవదూషణ చట్టాల సవరణ కోరుతూ అసెంబ్లీలో బిల్లు ప్రతిపాదించిన అసెంబ్లీ సభ్యురాలు షెర్రీరహమాన్‌ను బెదిరిస్తూ ఛాందసవాదులు కరపత్రాలను పంచి పెట్టారు. తన పొరుగు వారితో మాట్లాడుతూ తన వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించిన క్రిస్టియన్ మహిళ ఆసియాబీబీపై దైవదూషణ కేసు పెట్టి కోర్టుకు లాగారు. సెషన్సు కోర్టు ఆమెకు మరణశిక్ష వేసింది. ఇంతటితో ఆగలేదు. హైకోర్టు గనుక ఆమెను విడుదల చెయ్యటమో, శిక్ష తగ్గించటమో చేస్తే, ఆమెను హతమార్చిన వారికి 50 వేల రూ॥లు బహుమానమిస్తామని మత పెద్దలు ప్రకటించారు. సాల్మన్ తసీర్ తన భార్య కూతురుతో వెళ్లి ఆమెను పరామర్శించి తనసానుభూతిని తెలిపాడు. ఆమెవద్ద క్షమాభిక్ష విజ్ఞాపనను తీసుకుని అధ్యక్షుడు ఆసిఫ్ ఆలీ జర్దారీని కలిసి ఆమె తరపున వాదించాడు. అయితే లాహోర్ హైకోర్టు ఆమెకు క్షమాభిక్ష పెట్టవద్దని అధ్యక్షుడిని ఆదేశించింది. దీనితో ముల్లాలు ఆగ్రహించారు. తసీర్ అంగరక్షకుడు ముంతాజ్‌ఖాద్రీని సాధనంగావాడితసీర్‌ను హత్యకావించారు.

## సిగ్గుమాలిన లొంగుబాటు

ఒక సమయంలో పీపుల్సు పార్టీ నాయకులు దైవదూషణ చట్టాలను సవరిస్తామని గట్టిగా వాగ్దానాలు చేశారు. కానీ ఆచరణలో ఛాందసవాదశక్తులకు లొంగిపోయారు. సాల్మన్‌తసీర్‌ను కూడా వంటరి వాడిని చేశారు. "మొత్తంగా దేశమూ, సమాజమూ రెండుగా చీలిపోయిన ఉద్రిక్త జాతీయ సమస్యగా" దైవదూషణ అంశముందనీ, "ఏకాభిప్రాయం సాధనకు రాజకీయ ప్రక్రియను ప్రారంభించి, నడపకుండా ప్రభుత్వం తొందరపడి ఒక పక్షం వైపు చేరరాద"ని యిప్పుడు వాదిస్తున్నారు.

భద్రతా కారణాల సాకు చెప్పి సాల్మన్ తసీర్ అంత్యక్రియలకు పాకిస్తాను అధ్యక్షుడు హాజరుకాలేదు. ఫత్వాలు నివారించేందుకు అంత్యక్రియలకు హాజరు కావద్దని ముస్లింలీగు (ఎన్)కు సూచించింది. మత సంస్థ జమాత్-ఏ-అహ్లె-సున్నత్ పాకిస్తాన్ ఆజ్ఞాపించినందున ప్రార్థన చేసేందుకు పూజారులెవరూ ముందుకు రానందున ఇస్లామాబాద్‌లో తసీర్ అంత్యక్రియలు జరగలేదు. ఆయన భౌతికకాయాన్ని విమానంలో లాహోర్‌కు తరలించి ఆయన కుమారులు, స్నేహితులు, బంధువులు కొద్దిమంది సమక్షంలో ఖననం చేశారు.

## ప్రజాస్వామిక నిరసన

సాల్మన్ తసీర్ హత్య ప్రజాస్వామిక శక్తులకు తగిలిన తీవ్రమైన గాయం అయినా అదే వారికి ఆయుధమైంది. సిటిజన్ ఫర్ డెమోక్రసీ (ప్రజాస్వామ్యం కొరకు పౌరులు) అన్న సంస్థ దైవదూషణ చట్టాలకు వ్యతిరేకంగా చురుకుగా ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తున్నది. "ఇంతకాలం సాగింది చాలు. మరోధీరుడు నేలకొరిగాడు. ఈ పిచ్చిని ఆపాలి. మిగిలిన నల్లచట్టాలతో పాటుగా దైవదూషణ చట్టాలు కూడా రద్దుకావాలి. ఈ అధ్యాయం ఇక్కడితో ముగియలేదు. తసీర్ అమరత్వం మరో అధ్యాయానికి ప్రారంభమైంది. ఆయన చనిపోలేదు. జీవించేవుండి మనతో ఇలా అంటున్నాడు. నాపని నేను చేశాను మీ సంగతేమిటి?" అని ప్రకటించింది.

సాల్మన్ తసీర్ కుమార్తె షేర్‌బానో తసీర్ "ఒక వీరుడుని నేడు పూడ్చి పెట్టాం; కానీ ఆయన మనలో నింపిన ధైర్యాన్ని కాదు" అన్నారు. తసీర్ హంతకులను శిక్షించాలనీ, మత వైషమ్యాలను వ్యాప్తి చేస్తున్నవారిని శిక్షించాలనీ, దైవ దూషణ చట్టాలను సవరించాలనీ కోరుతూ ఒక ప్రజాస్వామిక ఉద్యమం సాగుతున్నది. సాల్మన్ తసీర్‌కు సంస్మరణగా క్రొవ్వొత్తులు వెలిగించి వాటితో ప్రదర్శనలు ఇస్లామాబాద్, కరాచీలలో సాగుతున్నాయి. ఇస్లామాబాద్‌లోని కోషార్ మార్కెట్టులోని వాహనాలు నిలిపే స్థలంలోనే తసీర్‌ను హత్య చేశారు. దానికి నేడు సాల్మన్ తసీర్ స్క్వేర్ అని ప్రజలు పిలుస్తున్నారు, పాకిస్తాను భవిష్యత్తుపై ప్రసరిస్తున్న వెలుగు కిరణమిది.

భారత్‌లో ప్రజాస్వామిక శక్తులు ముందుకొచ్చి తసీర్ హత్యను ఖండించాయి. 70 ముస్లిం సంస్థలూ, పత్రికా రచయితలూ, కళాకారులూ, దీనిని ఖండిస్తున్న పత్రంపై 2011 జనవరి 9న సంతకాలు చేశారు. ఇది ఆహ్వానించ దగ్గది. ఈ నిరసనలో ప్రజాస్వామిక శక్తులు మరింతగా చేరాలి. పాకిస్తాన్‌లోని ప్రజాస్వామిక శక్తులకు మద్దతుగా నిలవాలి.

D

# మతకలహాలు-2010

డా॥ అస్గర్ ఆలీ ఇంజనీర్

**భారతదేశంలో** ఏ సంవత్సరమూ కూడా కల్లోల రహితంగా లేదు. బాబ్రీమసీదు కూల్చివేత తర్వాతి 1992-93 సం॥లు; 2002లో గుజరాత్‌లో సంభవించిన అతిపెద్ద మత మారణకాండ, 2008లో కంథమాల్ కలహాలు కాగా జాతీయ స్థాయిలో కెక్కని కలహాలు మిగతా సంవత్సరాలలో జరిగాయి. 1992లో ముంబాయిలో జరిగిన మతకలహాల వంటివో, 2002లో గుజరాత్‌లో జరిగిన వంటివో కాకున్నా 2010 సం॥లో మధ్యస్థాయి పట్టణాలు, చిన్నపట్టణాలు, గ్రామాలస్థాయిలో ఈ కలహాలు చోటు చేసుకున్నాయి.

ఏమైనా, కొన్ని కలహాలు కలవరం కలిగించేవిగా వున్నాయి. అలాగే ఆర్.ఎస్.ఎస్. మరియు దాని అనుబంధ సంస్థల నిరంతరాయ ప్రయత్నాల కారణంగా పెరుగుతున్న మతతత్వీకరణనూ విస్మరింపజాలం. తమ స్వీయ ప్రయోజనాలకనుగుణంగా కాంగ్రెస్ వంటి మితవాద పార్టీకూడా మతతత్వ ప్రమాదంపై, మతతత్వ బిజెపిపై తన దాడిని ఎక్కుపెట్టింది. మతతత్వ రాజకీయాలను బిజెపి అనేక కారణాలవలన తానుగా తీవ్రంగా ముందుకు సాగించలేక పోతున్నది. కానీ తన సంఘపరివారంలోని ఇతర సంస్థలను ఆ పనికి నియోగిస్తున్నది. బిజెపి కొన్ని రాష్ట్రాలలో అధికారంలో వుండి, ఈ రాష్ట్రాలలో ఆర్.యస్.యస్.ను ముందుంచడంతోపాటు అర్.యస్.యస్. నేపథ్యం కలవారిని వివిధ ప్రభుత్వ విభాగాలలోకి చేర్చుకోవటమనేది లౌకిక వాదానికి పెను ప్రమాదంగా వుంది.

కేంద్ర హోంమత్రిత్వశాఖ సమాచారం ప్రకారం 2001-2009 మధ్యకాలంలో 6,541 మతఘర్షణలు జరుగగా వీటిలో 2,234 మంది చనిపోయారు. అధికారికంగా చెప్పిన మతఘర్షణల సంఖ్య వాస్తవమేననుకున్నా, అనేక కారణాలతో మృతుల సంఖ్యను సరిగ్గా పేర్కొనటం అనేది జరగదు. 2002లో ఒక్క గుజరాత్ రాష్ట్రంలోనే 2000 మందికి పైగా చనిపోయారని అధికార వర్గాలన్నీ చెపుతుండగా, అధికార సమాచారం ప్రకారం 2001-2009 మధ్య 8 సం॥ల కాలంలో 2,234 మంది మరణించారు. అంటే గుజరాత్ మృతులను మినహాయిస్తే 8 సం॥ల కాలంలో మత ఘర్షణలలో 234 మందే మరణించారనటం వాస్తవంకాదు.

గుజరాత్ మత కలహాలలో 1000 మంది చనిపోయారనే కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలను పరిగణలోకి తీసుకున్నప్పటికీ కూడా 8 సం॥ల కాలంలో 1234 మంది అంటే సం॥నికి 150 మంది పైగా మత ఘర్షణల్లో చనిపోయారని అర్థమౌతుంది. ఇదికూడా చిన్న సంఖ్యేమీకాదు.

2009 చివరలో-డిసెంబరు 30వ తేదీన రాజస్థాన్‌లోని భిలెవాడలో చివరిగా మతకలహం జరిగింది. 2010సం॥ కూడా 2 భయంకరమైన కలహాలను చూసింది. సంఘపరివారం రాజస్థాన్‌ను గుజరాత్‌గా మార్చేందుకు వీలైన అన్ని ప్రయత్నాలనూ చేస్తున్నది. రాజస్థాన్‌కూడా ఇప్పటికే ఆ విధంగా మలచబడింది.

మహారాష్ట్రలో 1995-2000 మధ్య బిజెపి-శివసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోనున్న కాలం మినహా కాంగ్రెస్ పార్టీనే మిగతా కాలమంతా అధికారంలో కొనసాగినప్పటికీ మహారాష్ట్ర మత పరంగా సున్నితమైన రాష్ట్రంగానే వుంది. ప్రభుత్వ రికార్డుల పరంగా 2009 జనవరి 16న మహారాష్ట్రలోని ఎవత్‌మహల్‌లో మొదటి కలహం చోటు చేసుకుంది. కాలెజీచౌక్‌లో శివాజి, బాలథాకరేల చిత్రపటాలకు నల్లరంగు పూశారనే పుకార్ల కారణంగా ఈ సంఘటన జరిగింది. శివసైనికులు వీధుల్లోకివచ్చి బస్సులు, వాహనాలు, షాపులపై రాళ్ళు విసిరారు. ప్రాణనష్టం జరగకముందే పోలీసులు పరిస్థితిని అదుపుచేశారు. 50 మంది శివసైనికులను పోలీసులు అరెస్ట్‌చేశారు.

కర్ణాటక-ముఖ్యంగా దక్షిణ కర్ణాటక మత పరంగా ఉద్రిక్తతలకు నిలయమైన మరొక ప్రాంతం. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండీ 'రామసేన' తన చర్యలను తీవ్రం చేసింది. క్రిస్టియనులు, ముస్లిములు కూడా ఈ రాష్ట్రంలో దాడులకు గురౌతున్నారు. చర్చీలపైనా, మసీదులపైనా దాడులు పెరిగాయి. జనవరి 31న భత్కల్, మైసరల్‌లో చర్చీలపై దాడులు కొనసాగటంతోపాటుగా మంగుళూరులో మేరీమాత గాజువిగ్రహంపై దాడి జరిగింది. ఇంతేగాక మంగుళూరు లోని రెండు మసీదులు, ఒక అనాథ శరణాలయం, ఒకషాపు, ఒక ఇల్లు దాడికి గురైనవాటిలో వున్నాయి. అనాథ శరణాలయంపై దాడిలో ఒక విద్యార్ధి గాయపడ్డాడు.

కర్ణాటకలోని షిమోగా, ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మతహింస చోటుచేసుకుంది. కన్నడ వార్తాపత్రిక 'కన్నడప్రభ'లో ప్రచురితమైన తస్లీమానస్రీన్ వ్యాసం యొక్క అనువాదంతో రెచ్చగొట్టే ప్రక్రియ ప్రారంభమైంది. తస్రీమానస్రీన్ దానితో తనకేవిధమైన సంబంధం లేదని నిరాకరించింది. వాస్తవానికి 2006లో ఇంగ్లీషులో 'బురఖా'పై తను వ్రాసిన వ్యాసానికి చేసిన అనువాదం వక్రీకరించబడిందని ఆమె పేర్కొన్నారు. షిమోగా, హస్సాన్-రెండుపట్టణాలలో మతహింస చోటుచేసుకోగా, కర్ఫ్యూ విధించబడింది. ప్రాణనష్టం లేకపోయినప్పటికీ వాహనాలు తగులబెట్ట బడ్డాయి. పరిస్థితిని అదుపుచేయటంకోసం రెండు రోజులపాటు కర్ఫ్యూ పొడిగింపబడింది.

ఉత్తరప్రదేశ్‌లోని బరాలీలో కూడా మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మతహింస జరిగింది. మార్చి 2వ తేదీన ముస్లిమ్‌లు మహమ్మద్ జన్మదినం సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. వేలాదిమంది ముస్లిమ్‌లు పాల్గొన్న ఈ ప్రదర్శన ఒక నిర్దిష్ట మార్గంలో సాగనీయకుండా కొందరు హిందువులు అభ్యంతర పెట్టారు. బరైలీకి మతహింసకు సంబంధించిన చరిత్రలేదు. ఇరువైపులా రాళ్ళు విసురుకోవటం; వాహనాలు, ఇళ్ళు ధ్వంసం చేసుకోవటం జరిగాయి.

300మంది కానిస్టేబుల్స్‌కు ఇంతపెద్ద గుంపును నియంత్రించటం సాధ్యం కాకపోవటంతో కర్ఫ్యూను విధించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఏమైనప్పటికీ, మార్చి 8న ఉత్తహింద్-ఎ-మిల్లత్ మండలి అధ్యక్షుడు మౌలానా తౌకీర్‌లాజాఖాన్ ఊరేగింపులో రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేసినందుకు మార్చి 8న అతనిని పోలీసులు అరెస్టు చేశారు. ముస్లిములు నిరసన తెలియజేయటంతో మార్చి11న అతనిని విడుదల చేశారు. దీనితో హిందువులు నిరసన తెలియజేశారు. ముస్లిమ్‌ల వత్తిడి ఫలితంగా అతనిని విడుదల చేశారని పేర్కొంటూ మార్చి 12 నుండి కొత్తగా సమస్యను రాజేశారు.

హోలీ మరియు మహమ్మద్ ప్రవక్త జన్మదినం ఒకేరోజు రావటంతో ముస్లిమ్‌లు రెండురోజుల తర్వాత ఊరేగింపులు జరపాలని నిర్ణయించుకున్నారు. ఆంజుమన్-ఎ-ఖౌద్దమ్-ఎ-రసూల్‌కు చెందిన షబానీ మెయిన్ ఆ విధంగా జరపటానికి అంగీకరించలేదు. దీని కారణంగా గత రెండు సం॥ల నుండి రెండు ఊరేగింపులూ జరుగుతున్నాయి. ఇది మతఘర్షణల రూపంతీసుకొంది. బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం కూడా ప్రశాంతంగా ఉన్న బరైలీ హఠాత్తుగా ఎందుకు ఈ విధంగా బ్రద్దలయిందనే దానికి భిన్నమైన ఊహాగానాలున్నాయి. కాంగ్రెస్ యొక్క పాత్రతో అభద్రతకు గురైన మాయావతి బిజెపితో రహస్య అవగాహనతో హిందూ, ముస్లిమ్ ఓట్లను ఒక దగ్గరకు సమీకరించేందుకు కాంగ్రెస్, బియస్‌పి మత హింసను ప్రేరేపించటంలో ఏమాత్రం వెనకాడటంలేదు. మత హింస అనేది ఒక రాజకీయ విధానంగా మారిపోయింది కానీ, మత పరమైందిగా ఎంతమాత్రమూలేదు.

ఈ విధంగా బరైలీ చాలాకాలంగా కర్ఫ్యూ నీడలో వుంది. ఇంతకుముందెన్నడూ జరగని విధంగా పెద్దఎత్తున ఆస్తుల విధ్వంసం ఈ సందర్భంగా జరిగింది. ఈ కల్లోలం ముఖ్యంగా బి.యస్.పి., కాంగ్రెస్‌ల మధ్య శత్రుత్వం కారణంగా సంభవించింది

జాతీయ ప్రాధాన్యతను సంతరించుకొనడంతో పాటుగా పార్లమెంటులో కూడా ఈ అంశం లేవనెత్తబడింది.

హైదరాబాదులోని పాతబస్తీ-బిజెపి, ఎం.ఐ.ఎమ్‌ల మధ్య వైరం కారణంగా మతపరంగా తీవ్ర ఉద్రిక్తతలకు నిలయంగావుంది. పాతబస్తీలో పేదలు, నిరుపేదలుగా వున్న ముస్లిమ్‌లు బిజెపి సమర్ధకులైన కొందరు వ్యాపారులతో కలసిమెలసి వారివద్ద పనిచేస్తున్నారు. ఎక్కువ మంది పేద ముస్లిమ్‌లు మజ్లిస్ సమర్థకులుగా వున్నారు. మజ్లిస్ తన రాజకీయ ప్రభావాన్ని పెంచుకునేందుకు, అందులో భాగంగా మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పెద్దస్థాయిలో జరిపేందుకు, అంతేకాక గతమెన్నడూలేని విధంగా ప్రవక్త 'మసోలియం' యొక్క ప్రతిరూపాన్ని ప్రతిష్టించేందుకు నిర్ణయించింది. అందుకుగానూ పాతబస్తీ ప్రాంతమంతా విద్యుత్ దీపకాంతులతో అలంకరించి, 'బరావఫత్' అంటే ప్రవక్త జన్మదినం తర్వాతకూడా చాలాకాలం అలానే వుంచింది. కాగా, బిజెపికూడా ఏమీ తక్కువ తినకుండా హనుమాన్ జయంతి పెద్దస్థాయిలో జరపటంతో పాటుగా భారీ విగ్రహాలను అసాధారణంగా నిర్మించారు. బిజెపి కార్యకర్తలు మహమ్మద్ ప్రవక్త జన్మదిన అలంకరణలో భాగంగా వుంచిన జెండాలను తొలగించటంతో ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

బిజెపి, మజ్లిస్‌ల మధ్య ఈ తక్షణ కారణంతో పాటుగా శత్రుత్వానికి ఇతర కారణాలూ వున్నాయి. హెలీకాప్టర్ ప్రమాదంలో రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత నూతన ముఖ్యమంత్రిగా రోశయ్య పదవిలోకి వచ్చాడు. కాగా రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తున్నాడు. కానీ కాంగ్రెస్ అధినాయకత్వం రోశయ్యను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. రోశయ్య ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఈ కల్లోలాలలు వెనుక అతను వున్నాడని చాలామంది భావించారు. కానీ, మరొక విషయం కూడా ముందుకొచ్చింది. అదేమంటే కొంతమంది పెద్దపెద్ద బిల్డర్స్ ఈ విధమైన హింసను సృష్టించటంద్వారా ఈ స్థలాలను ఖాళీ చేయించి, ఈ స్థలాలను పెద్దపెద్ద కట్టడాల నిర్మాణానికి వినియోగించ పూనుకున్నారనేది మరొక వాదనకూడా దీని వెనుకవుంది. బిజెపి ఈ ప్రాంతంలో తన స్థానాన్ని పెంచుకోదలుచుకున్నది. పొరుగునే వున్న కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ బిజేపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికార పీఠం కోసం ఇంతవరకు పరీక్షింపబడలేదు. ఆ కారణంగా హిందువుల ఓట్లను సంఘటింతంచేసేందుకు వి.హెచ్.పి. కార్యకర్తల ద్వారా మతహింసను రెచ్చగొట్టిందనేది మరొకటి. మోటారు వాహనాలపై వచ్చినవారు ఈ విధమైన దాడులుకు పాల్పడ్డారని చెప్తున్నారు.

ఈ మత కలహం కూడా పెద్దస్థాయిలోదే. ఒక నెల కాలం పాటు కొనసాగింది. ఈ కాలమంతా పాతబస్తీ కర్ఫ్యూలో కొనసాగింది. పనికి కూడా బయటకు వెళ్ళలేక పేదలు ఎన్నో అవస్థలు పడ్డారు. అనేక ప్రభుత్వేతర సంస్థలు సహాయం అందించేందుకు ముందుకు వచ్చాయి. రాజకీయ నాయకులు ఆడే రాజకీయ క్రీడలలో బాధితులంతా పేదలే! పెద్ద ఎత్తున ఆస్తుల విధ్వంసంతోపాటుగా ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యారు.

పాతబస్తీలోకి బయటనుండి ప్రవేశించి హింసను ప్రేరేపించే వారి నుండి, తమనుతాము రక్షించుకునేందుకు 9-14 సం॥ల వయసున్న యువ ముస్లిమ్‌లు బృందాలుగా ఏర్పడ్డారు. ఇంగ్లాండ్‌కు చెందిన ఒక విద్యార్థి ఈ రక్షణ బృందాలపై ఒక అధ్యయన పత్రాన్ని రూపొందించి, ఈ వ్యాసకర్తకూడా హాజరైన, ఆస్ట్రేలియాలో జరిగిన ఒక మహాసభలో సమర్పించారు. ఈ యువకులు అప్పటికప్పుడు స్పందించి బృందాలుగా ఏర్పడ్డారు మినహా, వీరివెనుక ఏ రాజకీయ పార్టీ లేదా శక్తీవుండి దీనిని ఆర్గనైజ్ చేయలేదు. మతహింస ఏప్రిల్ ప్రారంభం వరకు దాదాపు నెలరోజులు కొనసాగింది.

ఏప్రిల్ 25న ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో కొంతమంది ఆడపిల్లల్ని కొందరు వేధింపులకు గురిచేశారనే పుకార్లు వ్యాపించడంతో మతపరమైన హింస చోటుచేసుకుంది. 25 షాపులు తగలపెట్టబడ్డాయి. ఫోర్టు ప్రాంతంలోని శివాజి మార్కెట్‌లో ఈ షాపులను తగలబెట్టటం ద్వారా ఇది మత రూపం తీసుకుంది. అధికారులు మాత్రం ఇది మతపరమైన స్వభావం కలిగినది కాదని నిరాకరించారు. రెండు సమూహాలకు చెందినవారు రెండు భిన్న మతాలకు చెందినవారు కావటం వలన ఇది మత స్వభావం సంతరించుకున్నదని అనిపిస్తుంది.

మహారాష్ట్రలోని ధూలే ప్రాంతం కూడా సున్నితమైన ప్రాంతంగావుంది. గతంలో కూడా ఘోరమైన కలహాలు ఇక్కడ చోటుచేసుకున్నాయి. కలెక్టరు ఆఫీసు ఎదురుగా ఇస్లామ్ మతప్రవక్త కార్టూన్‌లతో కూడిన పోస్టర్లు ప్రదర్శించడమనేది ముస్లిమ్‌ల నిరసనలకు కారణమైంది. మే నాలుగున ఆందోళనకారుల గుంపులపై పోలీసులు లాఠీఛార్జీ చేయటంతోపాటు, కాల్పులు కూడా సాగించారు-దీనిలో నలుగురు గాయపడగా లాఠీఛార్జీలో మరెందరో దెబ్బ తిన్నారు. రాళ్ళు విసురుతున్న సందర్భంలో డి.యస్.పి. వాహనం కూడా దెబ్బతిన్నది. ధూలేకు ఇన్‌ఛార్జి మంత్రిగా వున్న అబ్దుల్ సత్తార్ శాంతి కమిటీ సమావేశం నిర్వహించి హింసను నిరోధించగలిగారు.

ఆరుదశాబ్దాలపైగా స్వాతంత్ర్యానంతర కాలంలో కూడా, లౌకిక రాజ్యాంగపాలనానంతరంకూడా అప్రధానమైన అతిచిన్న విషయాలకుకూడా మతపరమైన హింస చెలరేగటం ఆశ్చర్యకరం! మహారాష్ట్రలోని అమాల్నెరెలో మే 19వ తేదీన పిండిమరలో మర ఆడించే వద్ద ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆ పిండిమర ఒక ముస్లిమ్‌కు చెందినదికాగా, ఒక హిందూ ఖాతాదారుడు తాను తెచ్చిన పప్పుదినుసులను మొదటి ప్రాధాన్యం ఇచ్చి మరవేయాలని పట్టుబట్టటం, మాటామాటా పెరగటం, ముస్లిములను లక్ష్యం చేసుకొని హింస చెలరేగటం జరిగిపోయాయి. గుంపులను చెదరగొట్టేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. ఇద్దరు వ్యక్తులు కాల్పులలో గాయపడ్డారు. పోలీసులపై కూడా దాడి జరిగింది. వారు 9 మంది గాయపడ్డారు.

రాజస్థాన్‌లో బలేసార్ గ్రామ సమీపంలో మే 23న మత పరమైన హింస జరిగింది. సైనీలలో ఆధిపత్య మతానికి చెందిన సభ్యుడొకరు పోలీసు కాల్పులలో చనిపోవటంతో వీరంతా పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. దీనికి ముందుగా ఈద్‌గాను ధ్వంసం చేశారు.

రహదారులు విశాలం చేయటంలో భాగంగా ఒక షాపును తొలగించటంతో వివాదం తలెత్తి ఈ సంఘటనలు జరిగాయి. ఎన్.ఆర్.ఇ.జి.ఏ. పథకం క్రింద పనిచేస్తున్న కూలీలందరూ కలసి ఈద్‌గాలోని ఒకభాగాన్ని నష్టపరిచారు.

మే 26వ తేదీన అహమ్మదాబాద్‌లో మత హింస బ్రద్దలైంది. షాపూర్‌వూ ప్రాంతంలో యాసిడ్ దాడుల్లో ఒక వ్యక్తిని చంపివేశారు. షాపుల నిర్వాహకులు తమ షాపులను వెనువెంటనే మూసివేశారు. నగరంలోని ఇతర ప్రాంతాలకు ఉద్రిక్తత వ్యాపించింది. చాకులు, కత్తులు, బయటకు తీశారు. ఇద్దరు వ్యక్తులను కత్తిపోట్లకు గురిచేశారు. ఒక మసీదు వద్ద ప్రార్ధనా సమయంలో వివాహానికి సంబంధించిన ఊరేగింపు సాగటంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఎదుటి సమూహాల దాడుల్లో 11మంది ప్రజలు గాయపడ్డారు. పోలీసులు గత్యంతరంలేని పరిస్థితుల్లో కాల్పులు సాగించారు. గాయపడిన వారిలో ఒకరైన విజయ్‌దత్యానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోవటంతో మరలా హింస చెలరేగింది. మోడీ ప్రభుత్వమే ఈ మతపరమైన హింసకు ప్రధానంగా బాధ్యత వహించాలని పి.యు.సి.ఎల్. ఆరోపించటంతో పాటుగా ఒక ప్రతినిధిబృందం గవర్నర్‌ను కలిసి దీనిలో జోక్యం చేసుకొని హింసను నిరోధించమని కోరింది.

ఏమైనా మతపరమైన హింస ఇతర ప్రాంతాలకు విస్తరించటంతోపాటుగా ఛలేపీర్‌కీ దర్గా ప్రాంతంలో ముసుగులు ధరించిన సాయుధ బాలుర గుంపు పోలీస్‌స్టేషన్‌కు 15 అడుగుల దూరంలో ఒక స్కూటర్‌వాలా గొంతు కోశారు. దీనికి ప్రతీకార చర్యగా సాయుధగుంపు రెండు మోటారుసైకిళ్ళను తగులబెట్టారు.

జూన్ 2వ తేదీన అమ్మాయిలను వేధించారనే సమస్యపై గుంపును చెదరగొట్టేందుకు మహారాష్ట్రలోని జలగాన్‌లో, రావార్‌లో మతహింస చెలరేగింది. పోలీసులు మొదట లాఠీఛార్జీ చేసి, తదనంతరం కాల్పులు జరిపారు. 12 మంది వ్యక్తులు రాళ్ళు విసురుకోవటంలోనూ, పోలీసు కాల్పులలోనూ గాయపడ్డారు. ఈవ్‌టీజింగ్ సంఘటన తదనంతరం ఒక గుంపు మస్తాన్‌షా మసీద్ పై దాడి చేశారు. ముగ్గురు పోలీసులు కూడా ఈ మత ఘటనలలో గాయపడ్డారు. ముస్లిమ్‌లకు చెందిన ఆస్తులపై, పలుషాపులపై ఈ గుంపు దాడి చేసింది.

చనిపోయిన ఆరు ఆవులు రోడ్డుపై పడివున్నాయనే వార్త వ్యాపించటంతో మాలెగావ్‌లో మత అశాంతి నెలకొంది. పోలీసులు సకాలంలో ఈ వార్తలను ఖండించక పోయివుంటే మాలెగావ్ బ్రద్దలైవుండేది. ఆ ఆవులను ఎవరో చంపటమో, నరకటమో చేయలేదు. వాటిని ఒక చోటునుండి మరోచోటకి రవాణాచేసిన సందర్భంలో ఊపిరాడక మరణించాయి. కొందరు హిందుత్వవాదులు ఇంటర్‌నెట్ ద్వారా తీవ్రంగా గాయపడిన ఆవుల కళేబరాల ఫోటోలను ప్రదర్శిస్తూ హింసను ప్రేరేపించారు. కానీ ఇది ఫలించలేదు. ప్రజలు రెచ్చిపోయేందుకు సిద్ధంకాలేదు.

ఉదయపూర్ జిల్లాలో శారదా పట్టణంలో జులై 24-25 తేదీల్లో ఇద్దరు తాగుబోతులైన గూండాలు కొట్లాడుకుంటున్నారు. వీరిలో ఒకరు ముస్లిమ్ కాగా మరొకరు గిరిజనుడు. శారదా పట్టణం ప్రధానంగా

(తరువాయి 7వ పేజీలో)

# మృత్యువుకి చేరువలో పేద బాలలు

**రేపటి** పౌరులుగా, భావిభారత నిర్దేశకులుగా పాలకులు చెప్తున్న బాలలు దయనీయ పరిస్థితుల్లో, పోషకాహార లోపంతో, అనారోగ్యంతో అకాల మరణాల పాలౌతున్నారు. అత్యధిక చిన్నారులు ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉండటానికి కారణాలను, వాటి పరిష్కారం గురించి చేపట్టవలసిన విధానాలను పాలక ప్రభుత్వాలు ఉద్దేశ పూర్వకంగానే విస్మరిస్తున్నాయి.

'స్వాతంత్ర్యం' వచ్చిందని చెప్పుకొంటున్న 63 సంవత్సరాల కాలంలో దేశ పాలక ప్రభుత్వాలు, ప్రజల ఏ మౌలిక సమస్యనూ పరిష్కరించలేకపోయాయి. వర్గ వ్యత్యాసాలు తీవ్రమైనాయి. బడా పెట్టుబడిదారులు వేల కోట్లకు పడగలెత్తుతుంటే పేదలు మరింత నిరుపేదలుగా మారారు. గ్రామీణ ప్రాంతంలో కొద్ది మంది చేతుల్లో భూమి కేంద్రీకరించబడి ఉండటంతో, ఎటువంటి భూమికీ నోచుకోని పేద రైతులు, వ్యవసాయ కూలీలు, తమరెక్కల కష్టం మీద ఆధారపడి, చాలీ చాలని కూలీతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. ఉత్పత్తి సాధనాలపై ఎటువంటి హక్కులేని పట్టణ పేదలు, కార్మికులు చాలీ చాలని వేతనాలతో అతికష్టం మీద వారి కుటుంబాలను గడుపుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగకపోగా తగ్గిపోవటం వలన కార్మికుల, పేదల సంఖ్య ఎక్కువ కావటంతో వారికి వచ్చే ఆదాయం మరింతగా కుదించుకు పోతున్నది. ఫలితంగా వీరి కుటుంబాల్లో గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు కూడా పోషకాహారం అందటం లేదు. ఫలితంగా గర్భిణీ స్త్రీలు, వారికి పుట్టే పిల్లలు అనారోగ్యం పాలౌతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు.

దేశంలో పేదల సంఖ్య ఎంత అనేది తేల్చటానికి పాలకులు చేసిన కసరత్తులు అపహాస్యంగా ఉన్నాయి. ప్రణాళికా సంఘం నిర్ధారణ ప్రకారం దేశంలో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాల సంఖ్య 6.25 కోట్లు కాగా, వీటిపై తర్జన-భర్జనలు పడిన తర్వాత, సురేష్ టెండుల్కర్ 8.70 కోట్ల కుటుంబాలుగా పేర్కొనగా, దాన్ని ప్రణాళికా సంఘం కూడా అమోదించింది. ఖచ్చితమైన సర్వేజరిపితే ఇంతకన్నా ఎక్కువ కుటుంబాలే ఉంటాయన్నది కాదనలేని సత్యం.

దేశంలో 50 శాతం మంది పిల్లలు, మహిళలు పోషకాహార లోపం ఎదుర్కొంటున్నారని, మహిళా, శిశు సంక్షేమంలో భారతదేశం ఎంతో వెనుకబడి ఉందని ఇటీవలే ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

## అంగన్‌వాడి కేంద్రాలు

పేదల ఏ ఒక్క మౌలిక సమస్యనూ పరిష్కరించలేని పాలక ప్రభుత్వాలు, వారి సమస్యలు మరుగు పర్చేందుకు, తద్వారా వారు పోరాట మార్గం చేపట్టకుండా ఉండేందుకు కొన్ని పథకాలను ప్రవేశపెట్టాయి. అందులో అంగన్‌వాడీ కేంద్రాలు ఒకటి. మన రాష్ట్రంలో 385 ఐసీడిఎస్ (సమగ్ర బాలల అభివృద్ధి పథకం) ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలోని 85వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న కుటుంబాల్లోని పిల్లలకు పోషకాహారాన్ని అందించటమే ధ్యేయంగా పాలకులు ప్రకటించారు. మూడేళ్ళలోపు పిల్లలకు 90గ్రాములు ఆపైన 110 గ్రాముల ఆహారాన్ని అందించవలసి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకి భిన్నంగా వాటిల్లోని చిన్నారులకు పోషకాహారం అందటంలేదు. 223 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలల్లో రెడీ టు ఈట్ ఫుడ్ పేరున ఏ.పి. ఫుడ్ సంస్థ ఉప్మా, కిచిడి, హల్వా, వడియాలు అందచేస్తున్నది. మిగతా ప్రాజెక్టుల్లో లోకల్ ఫుడ్ (స్థానిక ఆహారం) పేరుతో కిచిడి, పొంగలి, పెసరపప్పు, మినపప్పు, శనగలు, తదితర ఆహారాన్ని లోకల్ ఫుడ్‌లో ఇవ్వవలసిఉంది. ఏ.పి.ఫుడ్ సంస్థ అందిస్తున్న ఉప్మా, కిచిడి, ఎప్పుడో తయారు చేసిన నాణ్యత లేనిదిగా ఉండటం వలన మన పిల్లలు ఆహారాన్ని ముట్టడం లేదు. వడియాలు తింటున్నా సరుకు కొరత వున్నదని వాటి సప్లయ్‌ని తగ్గించి వేశారు. ఆహార సప్లయ్‌లో అవినీతి పేరుకొనిఉంది.

పిల్లలు ఇష్టపడేది పప్పుతో కూడిన అన్నం, పెరుగులేక చిక్కటి మజ్జిగ, ఇడ్లీ, గుగ్గిళ్ళలాంటి ఆహారాన్ని అన్న విషయం ప్రభుత్వానికి తెలియంది కాదు. లోకల్ ఫుడ్‌లో వీటిని పెట్టాలి. కాని అలాంటి ఆహారం పిల్లలకు అందటంలేదు. వీటిని అందచేసే కాంట్రాక్టర్లు లాభాలు చూసుకోవటం వలన నామ మాత్రంగానే ఇవి అంగన్ వాడీ కేంద్రాలకు అందటం వలన తగిన విధంగా చిన్నారులకు ఆహారం అందటం లేదు. తక్కువ పరిణామంతో ఎక్కువ మంది పిల్లలకు పెట్టవలసి రావటంతో ఆహారంలో రుచి లోపించి దాన్ని పిల్లలు ఇష్టంగా తినలేక పోతున్నారు. మధ్యాహ్న భోజనం పథకంలోలాగా అప్పటికప్పుడు తయారు చేసే వేడి ఆహారం అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు పెట్టాలని సుప్రీమ్‌కోర్టు తీర్పు యిచ్చినా, దాన్ని శిశుసంక్షేమశాఖ అమలు జరిగేటట్లు చూడటంలో విఫలమైంది. హైద్రాబాద్ నుండి సరఫరా అవుతున్న రెడీమేడ్ నాసిరకం ఆహారాన్నే (ఎం.టీ.ఎఫ్.) వేడి చేసి ఇస్తున్నారు. ఇది మరింత హానికరమైంది.

ఇతర పథకాల లాగానే అంగన్‌వాడి కేంద్రాల ఏర్పాటు కూడా పాలక ప్రభుత్వాలకు ఏజంట్లుగా ఉన్నవారికి, వారికి అనుకూలంగా ఉన్నసంస్థలకు లబ్ధిని చేకూర్చేదిగానే వుంది. అందువలన పిల్లలకు పోషకాహారం ఈ కేంద్రాల ద్వారా అందటంలేదు.

## ప్రమాదకర పరిస్థితుల్లో బాలలు

దారిద్ర్యంతో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలు పిల్లలకు పోషకాహారాన్ని పెట్టలేకపోవటం, దాన్ని అందిస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు విఫలంకావటంతో పేద పిల్లలు పోషకాహార లోపంతో తీవ్రంగా బాధపడు తున్నారు. వయస్సుకుతగ్గ బరువులేక ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారు. ఈ విషయాన్ని శిశు సంక్షేమశాఖ నివేదిక స్పష్టంచేస్తున్నది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్స్‌లో ఉన్న పిల్లలతోపాటు గ్రామాల్లోని ఇతర కుటుంబాల పిల్లల బరువును కూడా పరిశీలించారు. రాష్ట్రంలోని 50.94 లక్షలమంది బాలల బరువును చూసినప్పుడు అందులో 8,72,528 మంది వయస్సుకు తగ్గ బరువులేక అత్యంత ప్రమాదకర స్థితిలోనూ, 4,280 మంది ఈ ప్రమాదకర స్థాయిని కూడా దాటినట్లు, మరో 18.28 లక్షలమంది సాధారణ బరువుకన్నా తక్కువ ఉండి ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళుతున్నట్లు శిశుసంక్షేమశాఖ నివేదిక తెలియచేసింది. రాష్ట్రంలోని బాలల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితికి చెందిన బాలల సంస్థ యూనిసెఫ్ కూడా ఆందోళన వ్యక్తంచేసింది.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బాలల బరువును పరిశీలిస్తే వారు ఎంత ప్రమాదకర స్థాయిలో ఉన్నారో అర్థమౌతుంది.

ఈ లెక్కలను పరిశీలిస్తే పిల్లలు ఎంత ప్రమాదంలో పడ్డారో అర్థమౌతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లలు ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విధంగా రేపటి పౌరుల ప్రాణాలు గాలిలో దీపంలాగా కొట్టుమిట్టాడుతున్నాయి.

పాలక ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు, ప్రవేశ పెట్టబోయే పథకాలు ఏవీ కూడా ప్రజల పేదరికాన్ని తొలగించటంకాని, వారికి పోషకాహారాన్ని కానీ అందించలేవు. అంగన్‌వాడి పథకం కూడా అలాంటిదే. ఇలాంటి పథకాల పేరుతో ప్రజలను మభ్యపర్చి యాచించే వారిగా ప్రజలను తయారుచేసి, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడకుండా చేసి, తమచుట్టూ త్రిప్పుకోవటమే పాలక ప్రభుత్వాలు ధ్యేయంగా పెట్టుకొన్నాయి. అందుకే వారు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కరించకుండా ఇలాంటి పథకాలు ప్రవేశపెడుతున్నాయి. పాలకుల వర్గ స్వభావమే ఇది. పేదల ప్రతినిధులుగా వారు ఎప్పుడూ వ్యవహరించలేదు. భూస్వాముల, బడా పెట్టుబడిదారుల. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు కాపాడే వారుగానే ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికానికి, భూమికి అవినాభావ సంబంధం ఉంది ఉత్పత్తి సాధనమైన భూమి ప్రధానంగా కొద్ది మంది భూస్వాముల చేతుల్లో ఎక్కువగా ఉండటం, పేద రైతులకు, వ్యవసాయకూలీలకు భూమిపై హక్కు లేకపోవటం వలన, తమ శ్రమశక్తితో పండించే పంటలపై వారికి హక్కు లేకుండా పోయి, నామ మాత్రమైన కూలి డబ్బులతోనే కుటుంబాన్ని పోషించు కోవాల్సి రావటంతో దుర్భరమైన జీవితాలు గడుపు తున్నారు. వారి పిల్లలు పోషకాహారానికి, చదువుకి దూరం అవుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే భూమి సంబంధాలను బ్రద్దలు కొట్టే విప్లవ భూ సంస్కరణలు అమలు జరగాలి. ఆ పని ప్రస్తుతమున్న పాలక వర్గాలు చేయలేవు. పేదలే అందుకు ఉద్యమించాలి. D

| జిల్లా | మొత్తం | సాధరాణ చిన్నారులు | తక్కువ బరువువున్న పిల్లలు | ప్రమాదస్థాయిలో ఉన్నవారు |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 1,95,261 | 1,08,473 | 59,900 | 26,768 |
| విజయనగరం | 1,73,108 | 81,298 | 58,227 | 33,268 |
| విశాఖపట్టణం | 2,36,975 | 1,13,728 | 77,693 | 45,127 |
| తూర్పుగోదావరి | 3,06,858 | 1,51,212 | 1,01,933 | 53,343 |
| గుంటూరు | 4,68,861 | 2,55,070 | 1,31,223 | 82,393 |
| చిత్తూరు | 2,26,038 | 1,12,837 | 74,968 | 38,152 |
| కడప | 1,82,697 | 84,773 | 63,401 | 34,386 |
| వరంగల్ | 1,96,856 | 1,15,986 | 57,227 | 23,532 |
| ఆదిలాబాద్ | 1,87,901 | 84,053 | 64,861 | 38,795 |
| కరీంనగర్ | 2,01,468 | 1,09,890 | 63,069 | 28,231 |

## మతకలహాలు... (6వ పేజీ తరువాయి)

గిరిజన ప్రాంతంగా ఉంది. వి.హెచ్.పి., ఆర్.యస్.యస్. మరియు బి.జె.పి. ఈ సంఘటనను ఉపయోగించుకొని ప్రతీకారం తీర్చుకోవలసిందిగా గిరిజనులను రెచ్చగొట్టి వారందరికీ ఆయుధాలను అందజేశారు. వారందరూ ముస్లిమ్‌లు అధికంగా వుండే ప్రాంతంలో జమగూడి 70 ముస్లిమ్‌ల ఇళ్ళను తగులబెట్టారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో జరిగిన ఈ హింస జిల్లా మెజిస్ట్రేట్, మరియు యస్.పి. సమక్షంలోనే జరిగింది. జిల్లాలోని ఆరు గ్రామాలలోని 500 ముస్లిమ్ కుటుంబాలు నిర్వాసితులయ్యారు. ఒక కాంగ్రెస్ ఎం.పి. మరియు అతని భార్య అయిన ఎమ్.ఎల్.ఏ. ఆ ఇళ్ళ కూల్చివేత, దహనం సందర్భంగా అక్కడేవున్నారు. వారుకూడా అదే గిరిజన సమూహానికి చెందినవారు. ఈ సంఘటనపై మానవ హక్కుల కార్యకర్తలు పదేపదే చేసిన విజ్ఞప్తులను పెడచెవిన పెట్టిన ముఖ్యమంత్రి ఒక లౌకిక వాదిగా చెప్పుకునే అశోక్‌గెహ్లాట్-యస్.పి.పై, జిల్లా మెజిస్ట్రేట్‌లపై ఏ విధమైన చర్యలూ చేపట్టలేదు. ఏ విధమైన చర్యా తీసుకోక పోవడంపట్ల ముస్లిమ్‌లు ముఖ్యమంత్రిపట్ల తీవ్రమైన ఆగ్రహంతో వున్నారు. చర్యతీసుకోకపోగా ఈశాన్యప్రాంత గిరిజనుడైన ఈ యస్.పి.కి పదోన్నతి కల్పించి బదిలీచేశారు. న్యాయపరమైన విచారణను కూడా ముఖ్యమంత్రి అంగీకరించలేదు. అంతేగాక, తమ సర్వస్వాన్ని కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారాన్ని కూడా అందజేయలేదు. ప్రభుత్వం అందించే కొద్దిపాటి సహాయాన్ని ముస్లిమ్‌లు నిరాకరించగా పోలీసులతో వారిపై వత్తిడి తెచ్చారు.

రాజస్థాన్‌లో బిజెపి అధికారం కోల్పోయిన మొదలు అది తిరిగి అధికారంలోకి వచ్చేందుకు మతపరమైన తురుపు ముక్కనుపయోగిస్తున్నది. రాజస్థాన్‌లో మతతత్వ శక్తులను నియంత్రించేందుకు గెహ్లాట్ ఏ మాత్రం ఆసక్తి కనబరడటం లేదని, వారిష్టమొచ్చిన విధంగా వారు వ్యవహరించినా వారిని ఏ విధమైన శిక్షకూ గురిచేయకుండా మిన్నకున్నట్లుగా కనిపిస్తున్నది.

సెప్టెంబరు 4వ తేదీన మధ్యప్రదేశ్‌లో రాత్‌లామ్‌లో సాధారణంగా శాంతియుతంగా వుండే పట్టణంలో-రంగులువేయబడిన ఒక మసీదుపై కొందరు ఆవుపేడను విసరడంతో మత ఉద్రిక్తతలు చెలరేగాయి.

ముస్లిములు ఒక మోటారు సైకిల్‌ను తగులబెట్టారు. దానితో అవతలి మతానికి సంబంధించిన వారు ఆయుధాలతో రోడ్లపైకివచ్చి మోటారుసైకిల్స్‌ను, మరికొన్ని వాహనాలను తగులబెట్టారు. పట్టణంలో ఒకభాగము హింసాపూరితమైంది. పోలీసులు జోక్యం చేసుకొని యుద్ధానికి సిద్ధమైన రెండు సమూహాలనూ సర్దుబాటుచేశారు.

పశ్చిమబెంగాల్‌లోని 'దేగంగా'లో రాహుల్‌గాంధీ పర్యటనకు ముందుగా సెప్టెంబరు 6వ తేదీన మత హింస చోటు చేసుకుంది. సెప్టెంబర్ 6వ తేదీన దేగంగా హాజీ నూరుల్ ఇస్లామ్ నాయకత్వంలో నాలుగుగంటల పాటు సాగిన గందరగోళం-హిందువుల ఆస్తుల విధ్వంసానికి, ఒక దేవాలయాన్ని అపవిత్రం చేసేందుకు దోవతీశాయి. దీనిపై విచారణకు ఆదేశించారు. సైన్యాన్ని మోహరించినప్పటికీ సెప్టెంబర్ 6న ప్రారంభమైన ఈ విధ్వంసం 9వ తేదీవరకు కొనసాగింది. కార్తిక్‌పూర్‌లోని ముస్లిముల గోరీలదొడ్డి చుట్టూతా గోడ నిర్మించబడింది. హిందువులు దుర్గాపూజ నిర్వహించకుండా దేవాలయ ప్రవేశాన్ని మూసివేయటంతో ఈ చర్యకు పాల్పడినట్లు హిందువులు చెప్పారు. నూరుల్ ఇస్లామ్ పోలీసుస్టేషన్ వరకు ఒక ప్రదర్శన నిర్వహించగా ఈ ప్రదర్శన పొడవునా ఇళ్ళు, షాపులు ధ్వంసం చేయబడ్డాయి.

పోలీసులకు ముస్లిములు ఒక విజ్ఞాపనపత్రాన్ని సమర్పించదలిచారు. దీనితో మరల హిందువులు ఆయుధాలతో పోగై దాడులకు పాల్పడగా వారంతా దగ్గరలోని ముస్లిముల ఇళ్ళలో తలదాచుకోగా, ఆ ఇళ్ళపై కూడా దాడి జరిగింది. 'కలాసేరీ'లో కొన్ని ఇళ్ళు దెబ్బతినగా ఒక ట్రాక్టరు, టెంపోలను తగులబెట్టారు. పరిస్థితి అదుపు జేసేందుకు పోలీసులు ఆరురౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అయినా కొంత సమయం వరకూ విధ్వంసం ఆగకుండా సాగుతూనే వుంది. లక్షలాది రూపాయల విలువైన ఆస్తులు ధ్వంసమయ్యాయి.

ఈసారి మతసామరస్యానికి పేరొందిన 'మలేర్‌కోట్లా'లో మతహింస జరిగింది. 'మలేర్‌కోట్ల' నవాబు పాలనా కాలంలో పదవ గురుగోవిందసింగ్ ముస్లిము పిల్లలను రక్షించిన ఆనాటి నుండీ శిక్కులు, ముస్లిములు సామరస్యంగా కొనసాగుతున్నారు. 1947 దేశ విభజన కాలంలోకూడా మతకల్లోలాలు చోటు చేసుకొన్న సందర్భంలోనూ పంజాబ్‌లోని ఈ ఒక్క జిల్లా నుండే ముస్లిమ్‌లు పాకిస్తాన్‌కు వలస పోకుండా వుండగలిగారు.

అమెరికాలో ఖురాన్‌ను తగులబెట్టారనే వార్త వ్యాపించగానే సెప్టెంబర్ 12న మత హింస చోటు చేసుకుంది. అమెరికాలోని ఒక క్రిస్టియన్ మతాచార్యుడు ఖురాన్ ప్రతులను తగుల బెట్టిన కారణంగా ఈద్‌పండుగ వేడుకల అనంతరం మలేర్‌కోట్లాలోని ఒక చర్చి విధ్వంసం చేయబడింది. ఆవేశపూరిత గుంపులను అదుపు చేయటంలో పోలీసులు విఫలమయ్యారు. ముఫ్తిఫజ్లూర్ రహమాన్ శాంతికోసం విజ్ఞప్తి చేస్తూ ఈ ఆందోళనలన్నీ రాజకీయ దురుద్దేశపూరితమైనవిగా పేర్కొన్నారు. జరిగిన సంఘటలన్నీ పథకం ప్రకారం జరిగినవిగా పేర్కొన్నారు. మలేర్‌కోట్లాలో జరుగుతున్న ఆందోళనల వార్తలు తెలియటంతో లూధియానాలో క్రిస్టియన్లు మొత్తం ఆ ప్రాంతాన్నంతా దిగ్బంధనం చేశారు. అదేవిధంగా లూధియానాలోని జామామసీదువద్ద ముస్లిమ్‌లందరూ సమీకృతులై అమెరికాలో ఖురాన్‌ను తగులబెట్టటాన్ని నిరసించారు. అదుపు తప్పిన మూకలు పూంచ్‌లోని అటవీశాఖ కార్యాలయానికి, రెండు పోలీసు వాహనాలకు నిప్పంటించారు. దీనితో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి, భాష్పవాయువు ప్రయోగించటంతో నలుగురు గాయపడ్డారు. జమ్మూ ప్రాంతంలో ఈ గుంపులు బరాక్ ఒబమా దిష్టిబొమ్మలను దగ్ధంచేశారు.

రాజస్థాన్‌లోని ఝులవాద్ జిల్లాలో సెప్టెంబర్ 20వ తేదీన ముగ్గురు ముస్లిమ్ యువకులు ఒక గిరిజన బాలికపై అత్యాచారం జరపటంతో సంఘపరివార్ శక్తులచే రెచ్చగొట్టబడిన గిరిజనులు మనోహర్ ధానా మరి కొన్ని గ్రామాలను దోచుకున్నారు. మతహింస చోటుచేసుకుంది. ముస్లిములలో ఎక్కువభాగం సర్వస్వాన్నీ కోల్పోయి కట్టుబట్టలతో మనోహర్‌ధానాను విడిచిపెట్టవలసి వచ్చింది. మిగతా అంతా దోచుకో బడటమో, తగులబెట్టబడటమో జరిగింది. డిసెంబరు 12వ తేదీన ఉదయపూర్ జిల్లా శారద గ్రామంలో ఈ వ్యాసకర్తతో సహా మరికొందరు బాధితుల గాధలను విన్నారు. మనోహర్ థానాలో కూడా పోలీసులు సరైన విధంగా వ్యవహరించక, గిరిజనులు సాగించే విధ్వంసాన్ని కొనసాగనిచ్చారు.

సంఘ పరివార్ శక్తులు, గిరిజనులను, దళితులను మతతత్వీకరించి మత హింసకు పాల్పడేందుకు ఉపయోగిస్తున్నారు. మనోహర్‌ధానాలో బి.జె.పి.లోని రెండు ముఠాలు పాల్గొన్నాయి. ఈ విధంగా రాజస్థాన్‌లోని మనోహర్‌ధానాలో జరిగిన మత పరమైన హింసకు బి.జె.పి.లో అంతర్గతంగావున్న ముఠాతత్వము కూడా ఒక కారణంగావుంది. రాజస్థాన్‌ను కూడా గుజరాత్‌గా మార్చేందుకు బిజెపి తన ప్రయత్నాలన్నింటినీ తీవ్రంచేస్తుండగా పాలకవర్గ కాంగ్రెస్ పార్టీ తన ప్రయోజనాల రీత్యా తీవ్ర ఉపేక్షను వహిస్తున్నది.

*('సెక్యులర్ పర్‌స్పెక్టివ్' 1-15, జనవరి 2011 సంచిక నుండి)* D

# ప్రకృతి విపత్తును పదిరెట్లు పెంచే మురుగు కాల్వ వ్యవస్థ లోపాలను పరిష్కరించాలి!

## 'అధ్వాన్నమైన డ్రైనేజి-పంటల నష్టం' పై సదస్సు డిమాండ్



సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ కోటయ్య; హాజరయిన ప్రతినిధులు

**చిన్నాపురం, 18-1-11 :**

**లైలా**, జల్ తుఫానులతో నడ్డిరిగిన రైతులు డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కృష్ణాజిల్లాలో 6,68,480 ఎకరాల్లో పంటల నష్టం జరగ్గా, దాని విలువ 927.68 కోట్లు అని అధికారులు అంచనా వేశారు. ఇంత భారీ నష్టం కల్గటానికి ప్రకృతి వైపరీత్యం కంటే కూడా దశాబ్దాల తరబడి మరమ్మత్తులకు నోచుకోకుండా అధ్వాన్నంగా ఉన్న మురుగుకాల్వల దుస్థితే కారణంగావుంది.

ఈ నేపథ్యంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) అధ్వాన్నంగావున్న మురుగుకాల్వల తీరు తెన్నులపై సర్వే చేసింది. పంటల తీవ్రనష్టానికి కారణమైన మురుగు కాల్వలను సమగ్రంగా మరమ్మత్తులు చేయాలని, ముంపు బాధిత రైతాంగానికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండు చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) బందరు ఏరియాశాఖ ఆధ్వర్యంలో చిన్నాపురం సంత మార్కెట్ వద్ద 'అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజీ – పంటల నష్టం' అనే అంశంపై సదస్సు జరిగింది. కా॥ కొప్పినేని ఉమా మహేశ్వరరావు ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు.

ఈ సదస్సులో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య ప్రసంగిస్తూ "77లో వచ్చిన ఉప్పెనలో దివిసీమలో 10వేలమంది ప్రజలు బలయ్యారు. చిన్నాపురంలోనూ ఆనాడు మృతిచెందారు. ఆనాడు మన సంఘం సర్వే చేసి వివరాలు చెప్పకపోతే ప్రభుత్వ అధికారులకు సరైన అంచనా కూడా అందేది కాదు. ఆనాడు ప్రభుత్వనిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉప్పెన బాధితులు ఆందోళన చేశారు. న్యాయమైన పరిహారాన్ని, పక్కాఇళ్ళను, పునరావాసాన్ని సాధించుకున్నారు. ఈనాడు రైతాంగం ప్రకృతి వైపరీత్యం కంటే అధ్వాన్నంగా ఉన్న మురుగు కాల్వల వల్లే ప్రధానంగా నష్టపోయారు. వ్యవసాయాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది? దశాబ్దాల తరబడి మురుగు కాల్వలను ఎందుకు మరమ్మత్తులు చేయడంలేదు? 5వేల కోట్లు అంచనావేసి '220 కోట్లు కేటాయించి' 40 కోట్లు మాత్రమే ఖర్చు చేసినందుకు పాలకులు సిగ్గుపడటంలేదు. గత బడ్జెట్ సమయంలో 5 లక్షల కోట్లు బడా విదేశీ, స్వదేశీ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన పాలకులు మురుగు కాల్వలను, పంటకాల్వలను ఆధునీకరించేందుకు సిద్ధపడటం లేదంటే ఏమనుకోవాలి? ఎవరి ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఊడిగం చేస్తున్నదో అర్థమవుతోంది.

మురుగు కాల్వలను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు జరపాలన్నీ న్యాయమైన పరిహారం కోసం ముంపు బాధిత రైతాంగం సమరశీలంగా ఉద్యమించాలని కా॥ కోటయ్య పిలుపునిచ్చారు. ఎపిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ "ముంపు బాధిత రైతాంగాన్ని ఆదుకోవడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సి.ఎం. కిరణ్‌కుమార్‌రెడ్డి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవటంలో హెక్టారుకు ఆరువేలు ప్రకటించి మెరుగైన ప్యాకేజ్ అంటూ తెలుగు దేశం కంటే మేమే బెటర్ అంటాడు. వ్యవసాయం కంటే ఐటీనే మేలు అన్న చంద్రబాబు నేడు రైతాంగానికి 10 వేలు ఇవ్వాలని అంటాడు. జగన్ లక్ష్యదీక్ష, బెజెపి ఆందోళన, చిరంజీవి పర్యటనలు, తె.దే. నిరాహార దీక్షలు – ఇవి ఏవీ రైతుల ఆత్మహత్యలను ఆపలేక పోతున్నాయి. పాలకులు నైజాన్ని అర్థం చేసుకొని రైతాంగం సమైక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. రైతుకూలీసంఘం నాయకులు కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు మురుగు కాల్వల దుస్థితిపై రైకూసం రూపొందించిన కీ నోట్‌ను సోదాహరణంగా వివరించారు . రైకూసం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ వీరబాబు, కృష్ణాజిల్లా కోశాధికారి కా॥ తలసిల మనోహర్, జిల్లా నాయకులు కా॥ జగన్ ముంపు బాధిత రైతాంగాన్ని ఆదుకోవడంలో పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. సదస్సు ఈ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. మేజర్, మధ్యతరహా, చిన్నతరహా డ్రైన్లు అన్నింటినీ పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయాలనీ, ముంపు బాధిత రైతాంగానికి ఎకరాకు 15 వేలు, పాక్షిక నష్టానికి 7 వేలు, కౌలు రైతులకు 15 వేలు పరిహారం ఇవ్వాలని, ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని, మురుగు కాల్వలపై నిర్దిష్ట ప్రతిపాదనలతో చర్యలు చేపట్టాలనీ తీర్మానాలు చేసారు. సదస్సుకు బందరు, చిన్నాపురం, తుమ్మలచెరువు, సింహాచలం, పెదయాదవపల్లె తుమ్మల పాలెం, కృష్ణానగర్ గ్రామాల నుండి రైతులు 200పైగా పాల్గొన్నారు. ప్రజాకళాకారులు జనం పాటలు పాడి ఉత్తేజ పర్చారు. చిన్నాపురం ప్రాంత రైతాంగంపై సదస్సు మంచి ప్రభావం చూపింది. D


వెలువడింది!



రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)
రాష్ట్ర మహాసభల సావనీర్ - 2010
వెల : రు. 30/-
ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్‌వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2


**గత 10 ఏళ్లలో పెరిగిన ఆస్తులు రూ॥ కోట్లలో**

| కంపెనీ | 1990 | 2009 |
|---|---|---|
| 1. అంబానీలు | 3,241 | 4,25,187 |
| 2. టాటా | 6,851 | 2,30,827 |
| 3. జిందాల్ | - | 56,937 |
| 4. ఎల్ అండ్ టీ | 1,130 | 44,544 |
| 5. మహేంద్ర | 620 | 38,363 |
| 6. జయప్రకాష్ | 484 | 25,202 |
| 7. టివిఎస్ | 929 | 21,267 |
| 8. బజాజ్ | 1,228 | 28,521 |

*(విశాలాంధ్ర 2-2-2011 నుండి)*

# పెట్రోలు ధర పెంపుకు నిరసన




బందరులో ప్రదర్శన



పిడుగురాళ్ళలో ప్రదర్శన

**బందరు, 17-1-11 :**

**ఆహార** ధరల పెనుభారం క్రింద నలుగుతున్న ప్రజానీకంపై పెట్రోలు ధరల పెంపు భారాలకు నిరసనగా, తక్షణమే ఆయిల్ కంపెనీలను నియంత్రించి పెట్రోలు ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఏపిఎఫ్‌టియుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్ధనపూడి సోని ఈ సందర్భంగా మాట్లాడుతూ "లీటరు పెట్రోలు ధరలు నెలరోజుల క్రితం 3రూ॥లు పెంచి ప్రస్తుతం మరో 2.50 పెంచారు. గత ఆరు మాసాల్లో 6 సార్లు పెట్రోధరలను పెంచారు. ఆయిల్ ధరలను నియంత్రించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం వదులుకొని అవసరానికనుగుణంగా ఆయిల్ ధరలను పెంచుకొనే అధికారాన్ని ఆయిల్ కంపెనీలకు దఖలుపర్చారు. అంతర్జాతీయంగా ఆయిల్ ధరల బూచిని చూపి పెట్రోలు ధరలు పెంచడాన్ని ప్రభుత్వం సమర్ధించుకొంటోంది. నిజానికి 2008లో బ్యారల్ 1కి 120 డాలర్లు వుంటే 55 రూ॥ పెట్రోలు ధర ఉండగా, ప్రస్తుతం 93 డాలర్లు వున్నప్పుడు 62 రూ॥ పెట్రోలపై ధర ఎందుకు పెరిగింది? పెట్రోలు ధరలో 55 శాతం పన్నులు అధికంగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2009-10 సంవత్సరంలో 1,83,861 కోట్లు పన్నులు రూపేణా దండుకొన్నారు. నష్టాలు వస్తున్నాయని చెప్పడం, ధరలు పెరుగుదల అనివార్యమని చెప్పి ప్రజా సంక్షేమం వదిలేసిన ప్రభుత్వం ఆయిల్ ద్వారా వ్యాపారాన్ని సాగిస్తూ ప్రజల జేబులను కొల్లగొడుతున్నారు. ధరలు పెంచిన ప్రతిసారీ పన్నులు కూడా పెంచి ఖజానాను నింపుకొంటున్నారు. ప్రభుత్వ ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించందే అధిక ధరలను అరికట్టలేమని" అన్నారు. 19-1-11న అరుణోదయ కాలని, ఆదర్శనగర్, లక్ష్మణరావుపురం, దిమ్మలసెంటర్‌లలో ఏపిఎఫ్‌టియు, రైకూసం(ఆం.ప్ర.) కార్యకర్తలు ధరల పెంపుకు నిరసనగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిల్ ధరలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్న పాలకుల విధానాలను ఎండగట్టారు. ఈ నిరసన కార్యక్రమాల్లో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ పామర్తి అంజమ్మ, జె. జగన్, ఏపిఎఫ్‌టియు, ఎన్‌వైఎస్ నాయకులు, కార్మికులు, కూలీలు, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

**పిడుగురాళ్ళ, 22-1-11 :**

**పెట్రోలు** ధరలు పెరుగుదలకు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగానూ; లెనిన్ నగర్, విశ్వమోహనరెడ్డి నగర్; బ్రాహ్మణపల్లి భగత్‌సింగ్ నగర్; కోనంకి శివారు అల్లూరి సీతారామరాజునగర్ కాలనీల ప్రజల ఇంటి స్థలాలకు పట్టాలు, విద్యుత్తు, రోడ్లు, మరుగుదొడ్లు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు, స్మశాన స్థలాలు, రేషన్‌కార్డులు తదితర సమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య (ఏపిఎఫ్‌టియు), నవయువ సమాఖ్య, (ఎన్‌వైఎస్) స్త్రీవిముక్తి సంఘటనల ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ పట్టణంలో ప్రదర్శన – తహశీల్దార్, నగర పంచాయితీ కమీషనర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు.

తొలుత జానపాడు రోడ్డులోని ఏపిఎఫ్‌టియు కార్యాలయం నుండి వందలాది మంది ప్రజలు ఎర్ర జెండాలు, ప్ల కార్డులు, బ్యానర్లు చేత పట్టుకొని ప్రదర్శనగా ఏడుకొట్ల సెంటర్, ఆంధ్రాబ్యాంక్, పోలీసుస్టేషన్, సినిమాహాళ్ళ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ ధర్నా చేపట్టారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా సందర్భంగా ఏపిఎఫ్‌టియు పట్టణకార్యదర్శి కామ్రేడ్ కాంద్రకుంట ముసలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల అడుగులకు మడుగు లొత్తుతూ, ప్రపంచబ్యాంకు షరతులకు నిస్సిగ్గుగా తలవొగ్గి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలు జరుపుతున్న దాని ఫలితంగా దేశ ప్రజల జీవితాలు, జీవన పరిస్థితులు కడు దుర్భరంగా మారిపోయాయని అన్నారు.

స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకురాలు కామ్రేడ్ ఎమ్. నిర్మల మాట్లాడుతూ గత 60 సం॥లకు పైగా పరిపాలన సాగిస్తున్న భారత పాలక వర్గాలు వందల కోట్ల రూపాయల అక్రమ సంపాదనలలో మునిగి తేలుతూ పేదల రక్తమాంసాలను కొల్లగొడ్తున్నారని, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సామాన్యుడి పొయ్యిలో పిల్లిలేవని పరిస్థితి ఏర్పడిందని, ఏ కూరగాయ ధర చూసినా కిలో 40, 50 రూ॥ల తక్కువలేదని, ప్రధానంగా మహిళలందరూ ఈ ధరలకు వ్యతిరేకంగా ఉద్యమంలో ముందు నిలవాలన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ నీలాద్రి రాంబాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ముడిచమురు బ్యారల్ 120 డాలర్లు ఉండగా లీటర్ పెట్రోల్ 56 రూ॥ ఉందని బ్యారల్ రేటు 92 డాలర్లకు తగ్గినప్పటకీ ధర తగ్గకపోగా 65 రూ॥లు కు పెరిగిందని ఈ చర్య అయిల్ కంపెనీలకు లాభాలు చేకూర్చుడమేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం నాయకులు పి. కోటేశ్వరరావు; ఇంకా గురవయ్య, కృష్ణ. రాణి, జాని, రాజు, రాజేష్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**రెంటచింతల, 18-1-11 :**

**కేంద్ర** ప్రభుత్వ ప్రజావ్యతిరేక, దోపిడివర్గ అనుకూల విధానాల ఫలితంగా పెట్రోల్ ధరలు మరో మారు భగ్గుమన్నాయి. ఈ ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో రెంటచింతల మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ప్రదర్శనగా వెళ్ళి తహశీల్దార్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ కంపెనీలైన ఆయిల్ కంపెనీలపై ప్రభుత్వం తన నియంత్రణను ఎత్తివేసిందని దానితో జూన్ నెల నుండి ఇప్పటి వరకు ఆరుసార్లు ఆయిల్ ధరలు పెరిగాయని అన్నారు.

ఇప్పటికి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు మంట మండుతున్న కూరగాయల ధరలతో ప్రజల జీవనం దుర్భరమయ్యిందని, కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన సమస్త సరుకుల ధరలను అదుపు చేసి ప్రజలపైబడిన ధరల భారాన్ని తగ్గించాలని రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సురభి అమరలింగం, వాసు, సత్తయ్య, స్వాములు, స్వామియేలు తదితరులు పాల్గొన్నారు. D

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010